


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

22.09.2026
మంగళవారం| రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 83
పేజీలు : 08 | వెల: రూ.5

AJS
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## మేజిస్ట్రేట్ అనుమతి ఉండాల్సిందే

- మళ్లీ అరెస్ట్ చేయాలంటే..
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- నిబంధనలు ఉల్లంఘించిన పోలీసుపై
- చర్యలు తప్పవని స్పష్టం

5లో..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21, అనంతజనశక్తి న్యూస్**

పౌర హక్కుల పరిరక్షణ, పోలీసుల అధికార దుర్వినియోగానికి చెక్ పెట్టే దిశగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సెప్టెంబర్ 21వ తేదీ సోమవారం అత్యంత కీలకమైన, చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. సరైన ఆధారాలు లేదా చట్టబద్ధమైన కారణాలు చూపకుండా చేపట్టిన తొలి అరెస్టు రాజ్యాంగ విరుద్ధమని తేలి, నిందితుడు విడుదలైన పక్షంలో.. సదరు వ్యక్తిని మళ్లీ అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు నేరుగా ఉండదని కోర్టు తేల్చి చెప్పింది. పోలీసు యంత్రాంగం మళ్లీ ఆ వ్యక్తిని కస్టడీకి తీసుకోవాలంటే సంబంధిత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందస్తు అనుమతి పొంది తీరాల్సిందేనని స్పష్టం చేసింది. జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అతుల్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ సంచలన ఉత్తర్వులను జారీ చేసింది.

## వైసీపీ రౌడీలను వదిలిపెట్టం వారిని కఠినంగా శిక్షిస్తాం

- మంత్రి నారా లోకేష్ ఆగ్రహం
- విజయవాడలో డీఎస్సీ స్పోర్ట్ కోటా ఉపాధ్యాయులపై..
- వైసీపీ నేతలు దాడి చేయడంపై ఆగ్రహం



5లో..

**విజయవాడ, సెప్టెంబర్ 21, అనంతజనశక్తి న్యూస్**

విజయవాడలో డీఎస్సీ స్పోర్ట్ కోటా ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడి చేయడంపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ..గురువులపై దాడి చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. గురువులపై దాడి చేసిన క్రిమినల్ గ్యాంగ్‌లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. వాళ్ల భరతం పడతామని వార్నింగ్ ఇచ్చారు. అందరూ దైవంలా భావించే గురువులను వైన్ షాపులకు కాపలా పెట్టిన జగన్.. ఉపాధ్యాయులను గౌరవిస్తారని అనుకోవడం భ్రమ అని అన్నారు.

## అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

- భారీ నుంచి అతిభారీ వర్షా లు కురిసే అవకాశం
- హోంమంత్రి అనిత హెచ్చరికలు
- బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం

2లో..



**అమరావతి, సెప్టెంబర్ 21, అనంతజనశక్తి న్యూస్**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, రానున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత కలెక్టర్లు, ఎస్పీలు, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.

# గ్లోబల్ కంపెనీలకు హైదరాబాద్ హబ్

- ఉద్యమ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సాయం
- సీఎం రేవంత్ రెడ్డి కామెంట్
- హైదరాబాద్‌కు 100 కొత్త జీసీసీలే లక్ష్యం
- నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్ రాక
- దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం
- ఫ్యూచర్ సిటీతో గ్లోబల్ బిజినెస్ హబ్
- గ్లోబల్ కంపెనీలు–స్థానిక ప్రతిభ కలయిక
- ఉద్యమ బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సాయం
- 13 ఏళ్ల తర్వాత కుటుంబానికి ప్రభుత్వ అండ
- అమరవీరుల కుటుంబాలకు సంక్షేమ చర్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 21, అనంతజనశక్తి న్యూస్

హైదరాబాద్‌లో గ్లోబల్ కంపెనీల కార్యకలాపాలకు మరింత ఊపువస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో మార్పు.. లక్ష్యబద్ధమైన తమ ప్రభుత్వ పాలన ఫలితమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం పోస్టు పెట్టారు. నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సహా దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌కు వస్తున్నాయని వెల్లడించారు. లోరియల్, అమ్జెన్, ఎలిలిల్లీ, యూనిలీవర్ సంస్థలు హైదరాబాద్‌లో కార్యకలాపాలు కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది హైదరాబాద్‌లో 100 కొత్త జీసీసీలే లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. తాము నిర్ణయించిన షెడ్యూల్ కంటే ముందే జీసీసీల లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పుకొచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీతో ప్రపంచస్థాయి బిజినెస్ ఎకోసిస్టమ్ సాధ్యమని వివరించారు. గ్లోబల్ కంపెనీలు, స్థానిక ప్రతిభ కలిసేలా కొత్త వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. 2లో..

ప్రపంచ వ్యాపారాలకు హైదరాబాద్‌ను కీలక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. భారత్, ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశాలు తెలంగాణలో సృష్టిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**13 ఏళ్ల తర్వాత బాధితుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో కనిపించకుండా పోయిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన మండల రాజు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. మానవతా దృక్పథంతో రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు (34) 2013 జూన్ 20న అదృశ్యమైనట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆయన కుటుంబ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఎమ్మెల్యే తన విజ్ఞప్తిలో పేర్కొన్నారు.

వందేమాతరంపై కర్ణాటక
## అసెంబ్లీలో మళ్లీ రగడ

- రెండు చరణాల తర్వాత ఆపేశారు
- బీజేపీ నేతలు మాత్రం మొత్తం చరణాలు పాడారు

2లో..



## దైవాలపై దాడులా?

- జగన్ పై మంత్రి సవిత ఆగ్రహం
- గురువులపై గొడ్డలి పార్టీ నాయకుల దాడులు క్షమించరాని నేరం
- మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదు
- వైసీపీ క్యాడర్ కు మంత్రి సవిత హెచ్చరిక

2లో..

**పెనుకొండ సెప్టెంబర్ 21, అనంత జనశక్తి న్యూస్**

గురు బ్రహ్మ, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః అంటూ గురువులను దైవంగా కొలుచుకునే సమాజం మనదని, అటువంటి దైవాలపై గొడ్డలి పార్టీ గూండాలు దాడి చేయడం దారుణం... ఒకవైపు లిక్కర్ స్కామ్, మరో వైపు గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనంలో అక్రమాలు బయటకు రావడంతో జగన్ బ్యాచ్ లో గగ్గోలు మొదలైంది... టీచర్ల ఆత్మగౌరం దెబ్బతిసేలా, వారిని కష్టాన్ని తక్కువ చేసి చూపేలా మెగా డీఎస్సీలో అక్రమాలు అంటూ విష ప్రచారం మొదలు పెట్టారు.



## రోజుకో ఆధారం వెలుగులోకి..

ఒక అభ్యర్థి కోర్టును ఆశ్రయించిన తర్వాతే..
వ్యవహారం బయటకు వచ్చింది
వైసీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

2లో..



## కాకినాడ జిల్లాలో వైసీపీ బిగ్ షాక్

- జనసేనలోకి పార్టీ సీనియర్ నేత
- పవన్ సమక్షంలో వరుపుల సుబ్బారావు చేరిక

**కాకినాడ, సెప్టెంబర్ 21, అనంత జనశక్తి న్యూస్**

ప్రతిపక్ష వైసీపీకి మరో షాక్ తగిలింది. ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత వరుపుల సుబ్బారావు సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన జనసేన పార్టీలో చేరారు. కాకినాడ పర్యటనలో ఉన్న జనసేన అధినేత.. సుబ్బారావుకు కండువా కప్పి సాదరంగా జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. 2లో..



## దక్షిణాదిని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

- కేరళ, తెలంగాణ జిల్లాలకు ఐఎమ్‌డీ హై అలర్ట్

2లో..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రాలను మళ్ళీ భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వాతావరణ వ్యవస్థ పశ్చిమవాయువ్య దిశగా పయనిస్తూ మరింత బలపడటంతో రానున్న రోజుల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణ, కేరళ రాష్ట్రాలపై ఈ వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఐసోలేటెడ్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ఐఎమ్‌డీ మళ్లీడే వార్నింగ్ జారీ చేసింది.

## పేదోడి ఆత్మగౌరవమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన
- లబ్ధిదారులకు ఇల్లు కేటాయింపు పత్రాలు పంపిణీ

2లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 21, అనంత జనశక్తి న్యూస్**

పేదవాడి ఆత్మగౌరవమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాయదుర్గం మల్కం చెరువు సమీపంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇల్లు కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణ పేదల సొంతింటి కలకు తొలి అడుగు ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన అన్నారు. పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే బోనాలు ఎత్తించేలా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంత ఇళ్లు.. ఉచిత రిజిస్ట్రేషన్‌తో హక్కులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఏ పార్టీ వారు అని చూడకుండా ఇల్లు మంజూరు చేస్తున్నామని.. వచ్చే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు.

## బాలికపై ఆకతాయిలు అసభ్య చేష్టలు

- స్నేహితుడితో కలిసి ట్యూషన్ నుంచి వస్తుండగా
- ముగ్గురు వ్యక్తులు వారిని అడ్డగించి వేధింపులు
- బీహార్ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్

2లో..



# అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత వాతావరణ వ్యవస్థ దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాల వైపు కదులుతున్నట్లు అధికారుల తాజా అంచనాలు పేర్కొంటున్నాయి.
రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనిత ఆదేశించారు. ప్రభావిత జిల్లాల అధికారులకు ముందస్తు చర్యలపై సూచనలు జారీ చేశారు. ఒడిశాలో కురిసే భారీ వర్షాల ప్రభావంతో వంశధార, నాగావళి నదులు పొంగే అవకాశం ఉన్నందున సరిహద్దు ఒడిశా జిల్లాల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఇక, సహాయక చర్యల కోసం SDRF, NDRF బృందాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే తీర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.
వాగులు, పొంగిపొర్లే కాజ్‌వేలు, ముంపు ప్రాంతాల వద్ద తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే అన్ని కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచి, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనిత సూచించారు. చెట్లు, భారీ హోర్డింగులు, శిథిలావస్థలో ఉన్న ఇళ్ల సమీపంలో ఉండకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ వాతావరణ హెచ్చరికలను ప్రజలు తప్పనిసరిగా పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. తాజా వాతావరణ అంచనాల ప్రకారం సెప్టెంబర్ 22 నుంచి 24 వరకు ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలకు అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# దైవాలపై దాడులా?

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ...టీచర్లపైనా, సామాన్యులపైనా దాడులు చేస్తే ఊరుకోబోమని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం..'అని జగన్ ను, వైసీపీ నాయకులను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత హెచ్చరించారు. జగన్ కు దమ్ము, ధైర్యం ఉంటే మెగా డీఎస్సీ, గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనంపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. వైసీపీ కార్యకర్తలను జగన్ రెడ్డి పావులుగా వాడుకుంటున్నారన్నారు. ఆయన మాటలు నమ్మి దాడులకు తెగబడితే నష్టపోయేది వైసీపీ కార్యకర్తలేనన్నారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డికి తమకష్టాలు చెప్పుకోడానికి వచ్చిన టీచర్లపై గొడ్డలి పార్టీ గూండాలు దాడులు చేయడం బాధాకరమన్నారు. గురు బ్రహ్మ, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః అంటూ గురువులను దైవంగా కొలిచే సమాజం మనదన్నారు. అటువంటి దైవాలపై జగన్ గ్యాంగ్ దాడులు చేయడం క్షమించరాని నేరమన్నారు. 2025 మెగా డీఎస్సీలో టీచర్ అభ్యర్థులు రేయింబవళ్లు కష్టపడి లక్ష్యం సాధించారన్నారు. అటువారి కష్టాన్ని తక్కువ చేసి చూపుతూ, ఆత్మగౌరవం కించపరిచేలా నీలి మీడియాలో విషపు రాతలు రాస్తూ గొడ్డలి పార్టీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు.

**దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రా...**

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంత్రి నారా లోకేశ్ ఎంతో పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుంటే 2025 మెగా డీఎస్సీ నిర్వహించారని మంత్రి సవిత కొనియాడారు. స్పోర్ట్స్ కోటాలోగాని, మరేకోటాలోగాని ఎటువంటి అక్రమాలు జరగలేదని హైకోర్టు, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారన్నారు. కనీస అవగాహన కూడా లేకుండా జగన్, గొడ్డలి పార్టీ నాయకులు మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. జగన్ కు దమ్ము, ధైర్యం ఉంటే మెగా డీఎస్సీపైనా, ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్ 1 మూల్యాంకనంపైనా చర్చకు రావాలని మంత్రి సవిత సవాల్ విసిరారు.

**డైవర్షన్ కే దాడులు**

గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనం ఎల్.కె.జి. విద్యార్థుల మాదిరిగా మూడు పర్యాయాలు దిద్దారని సిట్ నివేదికలో బయటపడిందని మంత్రి సవిత తెలిపారు. లిక్కర్ కుంభకోణంలో జగన్ సహా వైసీపీ పెద్ద తలకాయలు అరెస్టయ్యే అవకాశముందనే వార్తలు మీడియాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ వార్తల నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి విజయవాడలోని శాప్ కార్యాలయంపైనా, ఉపాధ్యాయులపైనా గొడ్డలి పార్టీ గూండాలు దాడులకు తెగబడ్డారన్నారు. సమాజాన్ని ఉన్నతమార్గంలో పయనించేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయులపై జగన్ పార్టీ నాయకులు, గూండాలు దాడులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా దాడులకు తెగబడితే చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని మంత్రి సవిత హెచ్చరించారు.

**జగన్ కు పావులు కావొద్దు**

జగన్ రాజకీయ కుట్రలు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పావులు కావొద్దని మంత్రి సవిత హితవు పలికారు. జగన్ కు ప్రజాస్వామ్యంపైనా, చట్టాలపైనా గౌరవం లేదని, ఆయన మాటలు నమ్మి దాడులు చేస్తే జైలు పాలవ్వడం ఖాయమని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, రాష్ట్రంలో అల్లకల్లోలాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టంచేశారు. అయిదేళ్ల జగన్ అసమర్థ పాలన, రెండేళ్ల సీఎం చంద్రబాబు పాలన బేరీజు వేసుకుకోవాలన్నారు. జగన్ ను నమ్ముకుంటే జైలేనని, చంద్రబాబును నమ్ముకుంటే అభివృద్ధి అని వైసీపీ నాయకులకు మంత్రి సవిత హితవు పలికారు.

# వందేమాతరంపై కర్ణాటక అసెంబ్లీలో మళ్లీ రగడ

**బెంగళూరు, సెప్టెంబర్ 21, అనంత జనశక్తి న్యూస్**

వందేమాతరంపై కర్ణాటక అసెంబ్లీ, విధానసభలో సోమవారం కాసేపు రచ్చ జరిగింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, పశ్చిమ కనుమలకు సంబంధించి కస్తూరిరంగన్ రిపోర్టుపై చర్చించడానికి కర్ణాటక ప్రభుత్వం మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తోంది. సోమవారం అసెంబ్లీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందు నాయకులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అయితే, రెండు చరణాల తర్వాత కాంగ్రెస్ నేతలు పాడడం ఆపేశారు. కానీ, బీజేపీ నేతలు మాత్రం మొత్తం చరణాలు పాడారు. కాంగ్రెస్ నాయకులు రెండు చరణాలే పాడడంతో బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. తర్వాత వివిధ ప్రముఖులకు స్పీకర్ జీఎస్ పాటిల్ సంతాపం తెలిపారు. గత నెల 27న కన్నుమూసిన ఎమ్మెల్యే ఆర్‌బీ శిరియణ్ణవర్‌కు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాళి అర్పించారు.

**విధానసభలోనూ అదే సీన్**

విధానసభలోనూ వందేమాతరంపై అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇక్కడ కూడా అధికార పార్టీ నేతలు వందేమాతరంలోని రెండు చరణాలే పాడగా.. ప్రతిపక్ష బీజేపీ నేతలు మొత్తం చరణాలు ఆలపించారు. అధికార పార్టీ నేతలు రెండు చరణాలే పాడడంపై బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండలి చైర్మన్ సలీం అహ్మద్..రాజ్యాంగ పీఠికను చదువుతుండగానే బీజేపీ నేతలు మిగతా చరణాలను పూర్తిగా పాడారు. పూర్తి గేయాన్ని ప్లే చేయనందుకు ప్రభుత్వంపై బీజేపీ నేతలు విమర్శలు చేశారు. కాగా.. తన అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని మొదటి రెండు చరణాలనే పాడాలని కర్ణాటక ప్రభుత్వం ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది.

# దమ్ముంటే అసెంబ్లీకి వస్తే సాక్ష్యాలు చూపిస్తా

(మొదటి పేజీ తరువాయి)

ఓటమి తర్వాత కూడా రౌడీయిజం చేస్తున్నారని దుయ్యబట్టారు. అయితే, రౌడీయిజం చేసేవారి తోకలు కత్తిరిస్తామని, విధ్వంసకారులను తరిమి కొట్టే సత్తా కుప్పానికి ఉందని ఆయన హెచ్చరించారు.
ఫ్లెక్సీలకు పొట్టేళ్లు బలిచ్చి, రక్తాభిషేకాలు చేసేవారిని సైకోలు అనాలా..? మానసిక రోగులు అనాలా..? అంటూ చంద్రబాబు మండిపడ్డారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూను కూడా కల్తీ చేశారని అన్నారు.. ప్రతి ఎన్నికలోనూ టీడీపీకి ఓటేసి గెలిపించిన నియోజకవర్గాలు ఒకటి కుప్పం, రెండోది హిందూపూర్ అని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

**ఏ డీఎస్సీలోనూ అవకతవకలు జరగలేదు: సీఎం చంద్రబాబు**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ దాడులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కుప్పం బహిరంగ సభలో స్పందిస్తూ.. టీచర్లపై వైసీపీ నేతల దాడిని తప్పుపట్టారు. డీఎస్సీ ఉద్యోగాలు తమ కష్టార్జితమని టీచర్లంతా నినదిస్తున్నారని.. ఫేక్ పార్టీ అందరినీ ఫేక్ అంటే సహించేది లేదని విజయవాడలో స్పోర్ట్స్ టీచర్లు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఇవాళ విజయవాడలో గురువులపై రౌడీలు దాడి చేస్తున్నారని మండిపడ్డారు. టీచర్లపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని... చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'సీబీఎన్ జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్లలో అవినీతే జరగలేదు.. నా హయాంలో ఎప్పుడూ పేపర్ లీక్ కాలేదు. సీబీఎన్ పాలనలో టీచర్ల రిక్రూట్మెంట్, డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం... ఇదీ మన ట్రాక్ రికార్డ్' అని వెల్లడించారు.
నియామకాలు జరిగిన ఏడాది తర్వాత ఇప్పుడు లేనిపోని దుష్ప్రచారం చేస్తూ బురద జల్లుతున్నారని సీఎం మండిపడ్డారు. కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడలో అంబేద్కర్ విగ్రహం, విశాఖలో సముద్రం ఒడ్డున దుష్ప్రచారాన్ని తిప్పడికొడుతూ టీచర్లు గర్జించారన్నారు. ఫేక్ పేపర్‌కు చెందిన రిపోర్టర్ ఓ ఉపాధ్యాయుడిపై దాడి చేశారంటే... వైసీపీ మూకలు ఎంతకు బరితెగించాయో అర్థం చేసుకోవాలని అన్నారు. ఇలాంటి వాళ్లను ఇంకా ఉపేక్షించాలా..? వీరిలాగే కొనసాగితే ఆస్తులకు ఆడబిడ్డలకు రక్షణ ఉంటుందా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే సాక్ష్యాధారాలతో చూపించి వారి నోళ్లు మూయిస్తామని తెలిపారు. చట్టబద్ధంగా జరిగిన ప్రక్రియపై అవసరమైతే కోర్టులకు వెళ్లొచ్చని... కానీ దాడులేంటీ...? ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదొయడమేంటీ అంటూ ఫైర్ అయ్యారు.
201924 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని... రాష్ట్రానికి అది మామూలు నష్టం కాదని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. నాటి పాలనలో పాలకులే రౌడీయిజం చేశారని.. దారుణాలకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. కుప్పం వస్తే తనను కూడా ఇబ్బందులు పెట్టారని.. దౌర్జన్యాలకు దిగారని మండిపడ్డారు. ఓడిపోయిన తర్వాత కూడా చంపడానికైనా చావడానికైనా సిద్ధమంటూ రౌడీయిజం చేస్తున్నారని అన్నారు. రౌడియిజం చేసే వారి తోక కత్తిరిస్తామని... రౌడీలను విధ్వంసకారులను తరిమి కొట్టే సత్తా కుప్పానికి ఉందని హెచ్చరించారు. ఫ్లెక్సీలకు పొట్టేళ్లు బలి ఇచ్చి రక్తాభిషేకం చేస్తున్న వారిని సైకోలు అనాలా..? మానసిక రోగులు అనాలా..? అంటూ వ్యాఖ్యానించారు. తిరుమల పవిత్ర లడ్డూను కూడా కల్తీ చేశారని మండిపడ్డారు. ప్రతి ఎన్నికలోనూ సైకిల్ గుర్తుకు మాత్రమే ఓటేసి మద్దతిచ్చిన నియోజకవర్గాలు ఒకటి కుప్పం, రెండోది హిందూపూర్ అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# కాకినాడ జిల్లాలో వైసీపీ బిగ్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు నచ్చే తాను జనసేనలో చేరినట్టు వరుపుల సుబ్బారావు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో కమీషన్లు కొట్టేశారని ఆయన ఆరోపించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల కోసం ఎందుకూ పనికి రాని భూములను అధిక ధరలకు కొనుగోలు చేశారని ఆరోపించారు. ఇప్పటికీ పలు స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఇంటి స్థలాల విషయంలో వైఎస్ జగన్ వైఖరి సరిగా లేదని సుబ్బారావు పేర్కొన్నారు. పార్టీ విధానాలు నచ్చకపోవడంతోనే వైసీపీకి రాజీనామా చేసినట్లు వరుపుల తెలిపారు. అంతేకాదు, తన సీనియారిటీకి తగిన గౌరవం పార్టీలో లభించలేదని ఆయన అన్నారు.
తనకు వయసు ఎక్కువైందని జగన్ గతంలో చెప్పేవారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలు నచ్చడంతోనే జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సుబ్బారావు వెల్లడించారు. అయితే, తాను జనసేన నుంచి ఎలాంటి పదవి లేదా ప్రత్యేక కమిట్‌మెంట్ కోరలేదని ఆయన స్పష్టం చేశారు. అన్ని పార్టీల నాయకులతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ప్రత్తిపాడు నుంచి వరుపుల సుబ్బారావు రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి తొలిసారి గెలిచి, తర్వాత 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీని వీడారు. 2016 ఏప్రిల్ 8న టీడీపీలో చేరిన వరుపుల సుబ్బారావుకు 2019లో టీడీపీ టికెట్ దక్కకపోవడంతో మళ్లీ వైసీపీ గూటికి వచ్చారు. 2024 ఏపీ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు.

# బాలికపై ఆకతాయిలు అసభ్య చేష్టలు

**పాట్నా, సెప్టెంబర్ 21, అనంతజనశక్తి న్యూస్**

పదో తరగతి విద్యార్థినిపై ఆకతాయిలు వేధింపులకు పాల్పడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. బిహార్‌లోని జముయిలో జరిగిన ఈ ఉదంతానికి సంబంధించిన క్లిప్‌ను జత చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను నెటిజన్లు ట్యాగ్ చేసిన కొద్ది గంటల్లోనే చర్యలు చేపట్టారు. అంతకుముందు జముయి ఎస్పీ విశ్వజిత్ దయాళ్ మాట్లాడుతూ.. పోలీసులు సదరు టీనేజర్లను సంప్రదించారని, వీడియోలో కనిపిస్తున్న నిందితులను గుర్తించడానికి దాన్ని విశ్లేషిస్తున్నారని తెలిపారు. నిందితులను గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.
శనివారం రాత్రి 7 గంటలకు జరిగిన ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. "ఒక చిన్నారి చేతులు జోడించి తనను వదిలేయమని వేడుకుంటుంటే.. గూండాలు ఆమెను పట్టుకుని లాక్కెళ్లారు. దుండగులకు ఇలా ప్రవర్తించే హక్కు ఎవరు ఇచ్చారు? ఇది మన 'సంస్కృతి' కానే కాదు. ఇది పురుషాధిక్యత... ఏ పురుషుడైనా ఒక అమ్మాయి శరీరాన్ని, ఆమె కదలికలను, ఆమె నిర్ణయాలను నియంత్రించవచ్చనే అహంకారం" అని రాహుల్ గాంధీ 'ఎక్స్' (ట్విట్టర్) లో పోస్ట్ చేశారు.
చిన్నారులపై లైంగిక వేధింపులను అరికట్టేలా, నిందితులను శిక్షించడానికి ఉద్దేశించిన పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాత్రి 7 గంటలకు రోడ్డుపై ఒక అమ్మాయికి రక్షణ లేకపోవడానికి బీహార్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ బిహార్ మంత్రి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. "ప్రభుత్వం తరఫున స్థానిక యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుంది. నేను జముయి ఎస్పీతో మాట్లాడతాను. బాధ్యులైన వారిపై ఖచ్చితంగా చర్యలు ఉంటాయి. ఈ సంఘటన ఖచ్చితంగా ఖండించదగినదే, అయితే ఒక్క ఘటనను బట్టి బిహార్ మొత్తంలో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని చిత్రీకరించడం సరికాదు. బిహార్‌లో 'జంగిల్ రాజ్' నడుస్తోందని అనడం తప్పు. ఘటనలో దోషులుగా తేలిన ఎవరినైనా పోలీసులు అరెస్టు చేస్తారు" అని స్పష్టం చేశారు.
వైరల్ అయిన ఆ వీడియోలో.. ఇద్దరు విద్యార్థులను కొంతమంది వ్యక్తులు చుట్టుముట్టడం, అందులో ఒకడు ఆ బాలుడి షర్ట్ కాలర్ పట్టుకుని బాలికకు దూరంగా లాక్కెళ్లడం కనిపిస్తుంది. ఆ బాలిక అక్కడ నుంచి తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించగా, మాస్క్ ధరించిన ఒక వ్యక్తి ఆమెను అనుసరించి వెనుక నుంచి పట్టుకుని లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో తనను తాను కాపాడుకోవడానికి ఆ బాలిక గట్టిగా అరుస్తూ నిరోధించడం వినిపిస్తుంది. అంతలోనే బాలుడు వారి నుంచి విడిపించుకుని ఆమెకు సహాయం చేయడానికి పరుగెత్తుకొచ్చాడు. వారిద్దరూ సమీపంలో పార్క్ చేసిన తమ బైక్‌వైపు పరుగెత్తగా, దాడి చేసినవారు వారిని తరిమారు. ఘటన నుంచి తప్పించుకోవడానికి ఆ ఇద్దరు స్నేహితులు టూ వీలర్‌పై ఎక్కుతుండగా అక్కడ ఘర్షణ జరిగింది. దాడి చేసిన వారు మళ్లీ ఆ బాలిక చేతిని పట్టుకుని లాగారు. వీడియో ముగిసే సమయానికి ఆమె మళ్లీ వారిని దండం పెడుతూ వేడుకోవడం కనిపిస్తుంది. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ ప్రకారం.. బాధితులు స్థానికంగా ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. శనివారం సాయంత్రం కోచింగ్ క్లాసులకు హాజరైన తర్వాత వారు స్కూటర్‌పై బయటకు వెళ్లారు. వారు జముయిలఖీసరాయ్ రోడ్డులో ప్రయాణిస్తుండగా ఓ గుంపు వారిని అడ్డుకుంది.

**మహిళా కమిషన్ సుమోటోగా..**

బీహార్‌లోని జముయి జిల్లాలో బాలికపై లైంగిక వేధింపుల ఘటనను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ కేసులో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, వీడియో ఫుటేజ్ ఆధారంగా నిందితులందరినీ గుర్తించి అరెస్టు చేయాలని, నిష్పక్షపాత విచారణ జరిగేలా చూడాలని కోరుతూ కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ బీహార్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కి లేఖ రాశారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన వీడియోను మరింతగా షేర్ చేయకుండా నిరోధించడానికి, బాధితులకు రక్షణ, న్యాయ సహాయం, మానసిక కౌన్సెలింగ్ మరియు అవసరమైన చట్టపరమైన చర్యలు అందించాలని కమిషన్ ఆదేశించింది. ఏడు రోజుల్లోగా వివరణాత్మక కార్యాచరణ నివేదిక ను సమర్పించాలని ఛైర్‌పర్సన్ కూడా కోరారు.
ఇక బీహార్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ అప్సరా.. ఈ విషయంపై తాను జముయి జిల్లా మేజిస్ట్రేట్‌తో మాట్లాడినట్లు తెలిపారు. సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం లఖిసరాయ్‌జముయి సరిహద్దు సమీపంలో ఈ సంఘటన జరిగిందని జిల్లా మేజిస్ట్రేట్ ఆమెకు తెలియజేశారు. ఇందులో ప్రమేయం ఉన్న వ్యక్తులను గుర్తించి, ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కేసులో తీసుకున్న చర్యల వివరాలను సోమవారం సాయంత్రంలోగా అందిస్తామని జిల్లా మేజిస్ట్రేట్ తనకు హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ విషయంపై తాను జముయి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు కూడా ఒక లేఖ పంపి.. ఈ ఘటనపై తదుపరి చర్యల గురించి విచారిస్తానని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ తెలిపారు. వైరల్ వీడియో, బాధితురాలి వాంగ్మూలం, ఇతర ఆధారాల ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# రోజుకో ఆధారం వెలుగులోకి..

**అమరావతి, సెప్టెంబర్ 21, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక అభ్యర్థి కోర్టును ఆశ్రయించిన తర్వాతే వ్యవహారం బయటకు వచ్చిందని, ప్రస్తుతం రోజుకో ఆధారం వెలుగులోకి వస్తోందని ఆయన అన్నారు. డీఎస్సీ అభ్యర్థులే ఈ వ్యవహారాన్ని బయటకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. టెట్ అర్హత లేని వారికీ ఉద్యోగాలు ఇచ్చారంటూ సజ్జల ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో సంబంధం లేని కులాలను కూడా చేర్చారని, పోస్టుల ఆధారంగా రేట్లు నిర్ణయించి ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపణలు చేశారు. ఖాళీగా ఉన్న పోస్టుకు అనుగుణంగా నకిలీ సర్టిఫికెట్లు సమకూర్చి ఉద్యోగాలు ఇచ్చారంటూ విమర్శించారు. అభ్యర్థులను ఏడుసార్లు తనిఖీ చేశామని చెబుతున్న అధికారులు.. ఆ వెరిఫికేషన్ నిజంగా అర్హతల కోసమే జరిగిందా, లేక 'మనోడా? కాదా?' అని తెలుసుకోవడానికా అని ప్రశ్నించారు.
ఇక, డీఎస్సీ నియామకాలపై నిష్పాక్షికమైన స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని సజ్జల డిమాండ్ చేశారు. పరీక్షలు, నియామకాల ప్రక్రియకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించిన వారు అదే మంత్రిత్వ శాఖలో కొనసాగకూడదని అన్నారు. డీఎస్సీపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తప్పుడు పద్ధతుల్లో ఉద్యోగాలు పొందిన వారు, వారిని ఎంపిక చేసిన అధికారులు, వెరిఫికేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ధర్నాపై 30 యాక్ట్ ఎందుకు?

తమ పార్టీ నిరసన కార్యక్రమం ప్రకటించిన తర్వాత 30 యాక్ట్ అమల్లో ఉందని చెప్పారని సజ్జల అన్నారు. అయితే శాప్ కార్యాలయంలో టీడీపీకి చెందినవారికి 30 యాక్ట్ ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. వైసీపీ నిరసన రోజునే టీడీపీ, యువగళం కార్యకర్తలు అక్కడికి ఎందుకు వచ్చారని నిలదీశారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు కూడా అదే రోజు అక్కడికి రావడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. తమపై కేసులు పెట్టడం, వేధించడం జరుగుతోందని సజ్జల ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు కూడా యుద్ధానికి వెళ్లినట్లుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తాము సంయమనంతో వ్యవహరించామని, అయితే ముందురోజు నుంచే తమపై దాడికి ప్రణాళికలు జరిగాయని ఆరోపించారు. తమ కార్యకర్తలపై దాడి చేసి, తిరిగి తమపైనే ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు.

'ప్రభుత్వమే సమాధానం చెప్పాలి'

డీఎస్సీ అంశాన్ని ఉద్యోగులకు, వైసీపీకి మధ్య గొడవగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని సజ్జల విమర్శించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలే ఉన్నారనే భయంతోనే ముందస్తుగా ఎదురుదాడికి దిగుతున్నారని ఆరోపించారు. శాప్ కార్యాలయం వద్దకు వచ్చిన వారంతా నిజంగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులేనా అనే అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. డీఎస్సీ25 ఉపాధ్యాయులు అదే రోజు ఎందుకు అక్కడికి వచ్చారని, వారికి ముందురోజు నుంచే ఎవరు వసతి కల్పించారని సజ్జల ప్రశ్నించారు. తాము నాలుగు రోజుల ముందుగానే నిరసనను ప్రకటించామని, వారు కూడా రావాలనుకుంటే మరో రోజు రావాలని చెప్పవచ్చని అన్నారు. అయితే తాము నిరసన చేసే రోజునే వారిని ఎందుకు పిలిపించారని ప్రశ్నించారు. యువగళం కార్యకర్తలు అక్కడికి ఎందుకు వచ్చారో కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**'తప్పు జరగకపోతే విచారణకు భయమెందుకు?'**

డీఎస్సీలో ఎలాంటి తప్పు జరగలేదని చంద్రబాబు భావిస్తే విచారణకు ఆదేశించాలని సజ్జల అన్నారు. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే విచారణ అనంతరం ఆయన కుమారుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇలాంటి ఘటన జరిగినప్పుడు ఉద్యోగాలను తొలగించిన ఉదాహరణ ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లను ప్రజలు ప్రశ్నించాలని సజ్జల అన్నారు. తాము చేస్తున్న ఆరోపణలు తప్పని ప్రభుత్వం నిరూపిస్తే తామే ప్రజల ముందు నవ్వులపాలవుతామని వ్యాఖ్యానించారు. సమాధానాలు చెప్పాల్సింది ప్రభుత్వమే తప్ప తాము కాదని స్పష్టం చేశారు. డీఎస్సీ అంశంపై శాసనమండలిలో చర్చించాలని తాము కోరామని, అయితే మంత్రి లోకేశ్ ఎందుకు సమాధానం చెప్పలేదని సజ్జల ప్రశ్నించారు.

# పేదోడి ఆత్మగౌరవమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నగరంలో పేద కుటుంబాలకు సొంతింటితో పాటు గౌరవప్రదమైన చిరునామా కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ కార్యక్రమంలో కీలక అడుగు పడింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గం-మల్కం చెరువు సమీపంలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌కు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరానికి దూరంగా ఇళ్లు నిర్మించి పేదలను మరోసారి శివార్లకు తరలించే విధానానికి బదులుగా.. వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే సొంతింటి సదుపాయం కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. హైదరాబాద్‌లో భూముల విలువ అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే పేదల కోసం ఇళ్లను నిర్మించడం ద్వారా వారికి ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.
ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులు కల్పించడంతో పాటు 17 నుంచి 20 గజాల వరకు అన్‌డివైడెడ్ షేర్ ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఎకరం ధర సుమారు రూ.250 కోట్ల నుంచి రూ. 270 కోట్ల వరకు పలుకుతుందని.. ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లబ్ధిదారులైన ప్రతి కుటుంబ సభ్యులకి టవర్‌లో అన్‌డివైడెడ్ షేర్ కింద రిజిస్ట్రేషన్ చేస్తున్నామన్నారు. అంటే అపార్ట్‌మెంట్‌లోని ఇల్లు విలువ ఒక కోటి పది లక్షల వరకు ఉంటుందని చెప్పారు. తెలంగాణలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులు చేస్తామన్న మాట ప్రకారం ప్రజా ప్రభుత్వం ఇస్తున్న గిఫ్ట్ ఇదని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు.
సేల్‌డీడ్‌ను ఎలాంటి రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందించేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో లబ్ధిదారులకు కేవలం నివాస సదుపాయం కాకుండా భవిష్యత్ తరాలకు మిగిలే ఆస్తి లభిస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం, పైరవీలకు అవకాశం ఉండదని పొంగులేటి స్పష్టం చేశారు. అర్హత ఆధారంగా లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఎంపికైన వారి వివరాలను బహిరంగంగా ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన కుటుంబాలు ఎవరైనా తొలి విడతలో అవకాశం రాకపోతే నిరాశ చెందాల్సిన అవసరం లేదని, దశలవారీగా ఇళ్ల నిర్మాణం కొనసాగుతుందని వివరించారు.
హైదరాబాద్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో తొలి విడతగా 480 ఇళ్ల చొప్పున నిర్మాణాన్ని చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు వేగవంతం అవుతాయని చెప్పారు. మొత్తంగా హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కొనసాగుతోందని మంత్రి తెలిపారు. తొలి దశలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు.

**రాయదుర్గం ఇందిరమ్మ టవర్స్ పనులను వేగంగా పూర్తి చేసి వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించేలా నిర్మాణాలను ముందుకు తీసుకెళ్తామని మంత్రి తెలిపారు. నిర్మాణ నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారానికి ఒకసారి నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించి పనులను పరిశీలించాలని సూచించారు. నాణ్యతలో లోపాలు కనిపిస్తే అక్కడే ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయాలని, వాటిని పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.**

# దక్షిణాదిని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు కేరళలో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఆదివారం కురిసిన భారీ వర్షాల కారణంగా కొండచరిలు విరిగిపడటం, బురద మేటలేయడం (మడ్ స్లైడ్స్), ఉవ్వెత్తున ఎగిసిపడిన ఫ్లాష్ ఫ్లడ్స్ తీవ్ర అలజడి సృష్టించాయి. ఈ వర్షాల దాటికి ఇప్పటివరకు ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు గల్లంతయ్యారని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. వర్షాల తీవ్రత పెరుగుతుండటంతో పరిస్థితిని గంట గంటకూ సమీక్షించాలని ప్రతిపక్ష నాయకుడు వి.డి. సతీశన్ అధికారులను ఆదేశించారు. దీనిపై విపత్తు నిర్వహణ అథారిటీ కమిషనర్ విఘ్నేశ్వరి ఐఏఎస్.. ఇడుక్కి, కొట్టాయం జిల్లాల కలెక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి ముందుస్తు జాగ్రత్తలను సమీక్షించారు. ప్రజలకు ఎస్ఎంఎస్ అలర్ట్‌లు పంపడంతో పాటు, అవసరమైన చోట ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు.
వర్షాల ధాటికి ఇడుక్కి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కొట్టకంబూర్ సమీపంలోని అమ్మన్ కోవిల్ ప్రాంతంలో వర్షం నుంచి బ్రతకడానికి ఒక పొలంలో ఉన్న షెడ్డులోకి ముగ్గురు వెళ్లారు. అయితే అకస్మాత్తుగా భారీగా బురద విరిగిపడి ఆ షెడ్డుపై పడటంతో అది కూలిపోయి ముగ్గురు లోపల చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో బాలకృష్ణన్ (40), చిన్నూ (36) అనే ఇద్దరు అక్కడికక్కడే మరణించగా, బాలకృష్ణన్ భార్య మరియమ్మ తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడింది. ఆ ప్రాంతంలో తవ్విన మట్టిని అక్కడే కుప్పగా పోయడం, దానికి తోడు భారీ వర్షం పడటమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.



# కేతన్ అగర్వాల్ హత్యకేసు.. ఛార్జ్‌షీట్‌కు ఆ ఫొటో అటాచ్..!



పుణెలో సంచలనం సృష్టించిన కేతన్ అగర్వాల్ హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితురాలు సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌధరిని 2025 డిసెంబర్‌లో రాజస్థాన్‌లో రహస్యంగా వివాహం చేసుకున్నారనే కోణంలో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. సియా, చేతన్ ఫోన్లను పోలీసులు విశ్లేషించిన నేపథ్యంలో కేసుకు కీలకమైన ఫొటో ఒకటి లభ్యమైనట్లు తెలుస్తోంది.

ఫోన్ల నుంచి రికవర్ చేసిన ఒక ఫొటోలో సియా , చేతన్ దండలు ధరించి ఉన్నారని పోలీసులు తెలిపారు. ఆ ఫొటోను 5,053 పేజీల ఛార్జ్‌షీట్‌లో అటాచ్ చేశారు. ఆ ఫొటోకు సంబంధించిన వివరాలను ధ్రువీకరించుకునేందుకు పోలీసు బృందాలు రాజస్థాన్ వెళ్లి దర్యాప్తుచేశాయి. అయితే వారి వివాహాన్ని ధ్రువీకరించేలా.. అధికారిక రికార్డులు, సీసీటీవీ ఫుటేజీ ఏవీ లభ్యంకాలేదని తెలుస్తోంది. అయితే.. సియా, చేతన్ తమ స్నేహితులతో కలిసి రాజస్థాన్‌లో పర్యటించిన ఆధారాలను మాత్రం సేకరించారు. వీరిద్దరూ అక్టోబర్ 2025 నుంచి రిలేషన్‌లో ఉన్నారని తెలుస్తోంది.

కేతన్ అగర్వాల్-సియాలకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిగింది. ఈ నవంబర్‌లో ఉదయ్‌పుర్‌లో వివాహం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో.. జూన్ 18న కేతన్ లోయలో పడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. పుణెలోని చారిత్రక లోహగఢ్ కోట వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనగా పోలీసులు భావించగా.. ఆ తర్వాత దాన్ని హత్యగా తేల్చారు.

# అధికారులకు టిప్ ఇవ్వడంలో తప్పులేదు

**- : మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు**

ప్రభుత్వ అధికారులకు టిప్ ఇవ్వడంతో తప్పులేదంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో వివాదాస్పదంగా మారాయి. పరోక్షంగా లంచం ఇవ్వడాన్ని ఆయన ప్రోత్సహిస్తున్నారంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

హసన జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో మంత్రి కె.ఎం.శివలింగే గౌడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఓ వ్యక్తి లేచి, పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వ అధికారులు డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై శివలింగే మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు తమ పనులను సకాలంలో పూర్తి చేసినప్పుడు.. ప్రజలు వారికి టిప్ ఇవ్వడంలో ఎలాంటి తప్పు లేదని పేర్కొన్నారు. దీంతో ఆ కార్యక్రమానికి హాజరైన ప్రజలు మంత్రి మాటలను తప్పుబట్టారు. ఇది లంచాలను బహిరంగంగా ప్రోత్సహించడమే అవుతుందన్నారు. మంత్రి పక్కనే కూర్చున్న హసన డిప్యూటీ కమిషనర్ లతా కుమారి జోక్యం చేసుకుని వారిని శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

తన వ్యాఖ్యలపై వ్యతిరేకత రావడంతో మంత్రి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అధికారులు ప్రజల నుంచి బలవంతంగా డబ్బు వసూలు చేయకూడదని.. ఇష్టపూర్వకంగా ఇస్తే తప్పు లేదని పేర్కొన్నారు. నిజాయతీగా పనిచేసే వారిని గౌరవించాలని చెప్పడమే తన ఉద్దేశమని.. తాను లంచాన్నిప్రోత్సహించట్లేదన్నారు.

కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది: భాజపా

మంత్రి శివలింగే గౌడ మాటలపై భాజపా విమర్శలు గుప్పించింది. సామాన్యుల జేబులకు చిల్లుపెట్టడం ధర్మమని బోధించే కాంగ్రెస్ నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని భాజపా నేత సీటీ రవి పేర్కొన్నారు.



ఈ ఘటనతో ఆ పార్టీ నేతల నిజస్వరూపం ప్రజలకు తెలిసిందన్నారు.

# మళ్లీ తెరపైకి ధర్మస్థల హత్యాచార కేసు



సుమారు 14ఏళ్లుగా మిస్టరీగా ఉన్న 'ధర్మస్థల' అత్యాచారం, హత్య కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ కేసులో మళ్లీ దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొంది. 2012 అక్టోబర్ 9న ధర్మస్థలలో 17 ఏళ్ల యువతి అపహరణకు గురై.. మరుసటి రోజు నేత్రావతి నది సమీపంలో శవమై కనిపించించిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. కేసును తొలుత కర్ణాటక సీఐడీ దర్యాప్తు చేయగా.. అనంతరం సీబీఐకి అప్పగించారు. ఈ కేసులో సంతోష్‌రావు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. తగిన ఆధారాలు లేకపోవడంతో 2023లో సీబీఐ స్పెషల్ కోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసింది. బాధితురాలి తల్లి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. గత దర్యాప్తులో కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆమె ఆరోపించారు. కేసులో సరైన దర్యాప్తు జరగలేదని పేర్కొంటూ మళ్లీ విచారణ జరపాలని కోరారు. ఈ మేరకు పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు.. కేసును పునర్విచారణ చేపట్టాలని ఆదేశించింది. దీంతో ఈ కేసులో న్యాయం జరుగుతుందా? అసలు నేరానికి పాల్పడింది ఎవరు? అనే ప్రశ్నలకు ఈసారైనా సమాధానాలు లభిస్తాయా అనేది ఆసక్తికరంగా మారింది.

# విద్యార్థి ఆత్మహత్యపై నిరసనలు.. క్షమాపణలు చెప్పిన ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే కు చెందిన పవయీ క్యాంపస్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర నిరసలకు దారితీస్తోంది. ఈ ఘటనపై ఇప్పటికే స్పందించిన ఐఐటీ బాంబే.. తాజాగా క్షమాపణలు చెప్పింది. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు జరుగుతోందని చెప్పింది. అతడి మరణానికి సంబంధించిన వివరాలు నిర్ధరణ కాకముందే వెల్లడించడం సరైంది కాదని పేర్కొంది. దర్యాప్తు ప్రారంభానికి ముందే.. సదరు విద్యార్థి పరీక్షలో చాట్‌జీపీటీని వినియోగించాడని చెప్పినందుకు గానూ క్షమాపణలు తెలియజేస్తున్నట్లు చెప్పింది. అలాగే తమ డైరెక్టర్ శిరీష్‌కేదారే రాజీనామా చేయలేదని స్పష్టం చేసింది. ఆయన రాజీనామా కోసం విద్యార్థులు డిమాండ్ చేస్తోన్న విషయం తెలిసిందే.

ప్రొఫెసర్ తొలగింపు..

కుల వివక్షతో కూడిన వేధింపులవల్లే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపించడంతో ఈ వివాదం మలుపు తిరిగింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 108 (ఆత్మహత్యకు ప్రోద్బలం), ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్ట నిబంధనల కింద కేసు నమోదు చేశారు. ఆ పరీక్ష సమయంలో ఇన్విజిలేటర్‌గా ఉన్న ప్రొఫెసర్‌ను డీన్ పోస్ట్ నుంచి విద్యాసంస్థ తొలగించింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. దర్యాప్తు తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని తెలిపింది. అదే సమయంలో విద్యార్థుల సంక్షేమం,





క్రమశిక్షణా ప్రక్రియలు, జవాబుదారీతనం వంటి అంశాల్లో విద్యార్థులు చేసిన 18 డిమాండ్లపై ఐఐటీ బాంబే డైరెక్టర్ సంతకం చేశారు.

మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లాకు చెందిన సాహిల్ రవీంద్ర వకోడే ఐఐటీ బాంబేలో 'ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్' విభాగ రెండో సంవత్సర విద్యార్థి. ఇటీవల పరీక్ష హాలులోకి సెల్‌ఫోన్ తీసుకొచ్చి ప్రశ్నపత్రాన్ని చాట్ జీపీటీలో అప్‌లోడ్ చేస్తుంటే దొరికిపోయాడని అధికారులు తెలిపారు. అయినప్పటికీ క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని, డిపార్ట్‌మెంట్ హెడ్, ఇన్‌స్ట్రక్టర్... సాహిల్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు పేర్కొన్నారు. కాగా, శుక్రవారం రాత్రి హాస్టల్ గదిలో సాహిల్ ఆత్మహత్య చేసుకోవడం అనుమానాలకు తావిచ్చింది . ''విద్యార్థి మరణం పట్ల మేం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాం. ఈ విచారకర సమయంలో మృతుడి స్నేహితులు, కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటిస్తున్నాం. ఘటనకు గల కారణాలపై సంబంధిత అధికారులతో దర్యాప్తు చేస్తున్నాం'' అని ఐఐటీ బాంబే శనివారం ప్రకటన విడుదల చేసింది.

# మంకేశ్ భాయ్ మసాజ్ టైమ్.. వీడియో వైరల్

అప్పటి వరకు చెట్లు, ఇళ్లపై గెంతుతూ.. తిరిగిన ఓ కోతి బాగా అలసిపోయింది. దీంతో రెస్టు తీసుకుందామని అనుకుందో ఏమో.. దారి మధ్యలోని ఓ బార్బర్‌షాప్‌లోకి దూరింది. అక్కడ ఉన్న ఓ కుర్చీపైకి ఎక్కి దర్జాగా పడుకుంది. ఇదంతా గమనించిన బార్బర్ షాప్ యజమాని అదిలించడానికి బదులు.. కోతి వద్దకు వెళ్లి మసాజ్ చేశాడు. ఈ స్పా ట్రీట్‌మెంట్‌కు అది మురిసిపోయింది. కుర్చీపై రిలాక్సింగ్ మోడ్‌లో కళ్లు మూసుకొని, మసాజ్‌ను ఎంజాయ్ చేసింది.

ఈ వీడియోను నాగాలాండ్ మంత్రి టెంజెన్ ఇమ్నా అలోంగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'మంకేశ్ భాయ్ మసాజ్ టైమ్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. దయచేసి డిస్టర్బ్ చేయొద్దు' అంటూ రాసుకొచ్చారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'మంకేశ్ మసాజ్ చేయించుకుంటున్నాడు. సరే మరి డబ్బులు ఎవరు కడతారు..?' అంటూ ఓ నెటిజన్ సరదాగా వ్యాఖ్యానించాడు.



# విశాఖలో శ్రీలంక-భారత్ ద్వైపాక్షిక సముద్ర విన్యాసాలు

ఈస్ట్రన్ నేవల్ కమాండ్‌కు చెందిన విశాఖపట్నం కేంద్రంగా భారత్‌శ్రీలంక దేశాల మధ్య ద్వైపాక్షిక సముద్ర విన్యాసాలు ప్రారంభమైనట్లు నేవీ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఇందులో భాగంగా శ్రీలంక నౌకాదళానికి చెందిన యుద్ధనౌక 'ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ సిందూరాలా' విశాఖ తీరానికి చేరుకుందన్నారు. ఈ విన్యాసాలు 17న ప్రారంభం కాగా.. 21 వరకు కొనసాగుతాయన్నారు.



# 'క్వాకర్‌వోడ్జర్' అంటే ఏంటో తెలుసా..? ఎక్స్‌లో శశి థరూర్ పోస్ట్



కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ r) క్లిష్టమైన ఆంగ్ల పదంతో మరోసారి ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తాజాగా 'క్వాకర్‌వోడ్జర్' అనే పదాన్ని తెరపైకి తెచ్చారు. దీనికి అర్థం 'ఇతరుల నియంత్రణలో ఉండే రాజకీయ నాయకుడు.. ఇతరుల ఆదేశాల మేరకు పనిచేసే రాజకీయ కీలుబొమ్మ' అంటూ అందులో వివరించారు. గత 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇలాంటి కొందరిని తయారు చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో ఆయన ఎవరిని ఉద్దేశించి అన్నారనే దానిపై చర్చ మొదలైంది. అయితే ఈ పదం థరూర్ తొలిసారి ఉపయోగించింది కాదు. 2022 ఏప్రిల్‌లోనూ దీనిని ఉపయోగించి పోస్టు పెట్టారు.

థరూర్ గతంలోనూ ఇలాంటి ఎన్నో పదాలను రాజకీయ వ్యాఖ్యలకు ఉపయోగించారు. అలోడాక్సాఫోబియా .. ఈ భయం ఉన్న వ్యక్తులు ఇతరుల ముందు తమ అభిప్రాయాలను చెప్పడానికి తీవ్రంగా భయపడుతుంటారని పేర్కొన్నారు. ఇలాంటి పదాలను థరూర్ ఉపయోగించిన ప్రతిసారీ వాటి అర్థాలను తెలుసుకునేందుకు నెటిజన్లు నిఘంటువులను ఆశ్రయిస్తున్నారు. క్లిష్టమైన పదజాలంతో రాజకీయ అంశాలను ప్రస్తావించడం థరూర్ ప్రత్యేకత.

# 85 ఏళ్ల వయసులో ఎంఏ.. పీహెచ్‌డీకీ రెడీ!



చదవాలనే తపన ఉండాలేగానీ.. వయసు అడ్డంకి కాదని నిరూపించారు హరియాణాలోని సిర్సాకు చెందిన విశ్రాంత సైనికుడు లాల్‌చంద్ గోదారా. 85 ఏళ్ల వయసులో ఆయన ఎంఏ పూర్తి చేయడం విశేషం. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. పీహెచ్‌డీగానీ, న్యాయశాస్త్రంగానీ అభ్యసించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. లాల్‌చంద్ 20 ఏళ్లు నిండకముందే సైన్యంలో చేరారు. అనంతరం హరియాణా రవాణాశాఖలో పని చేశారు. 2002లో ఉద్యోగ విరమణ తర్వాత క్రీడలవైపు వెళ్లారు. హరియాణా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు, ఇతర ఈవెంట్లలో పతకాలు సాధించారు. తన మనవళ్లు అడిగే ప్రశ్నలతో.. ఆయనకు మళ్లీ పుస్తకాలవైపు మనసు మళ్లింది. ఆగిపోయిన తన చదువును కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. దీంతో 76 ఏళ్ల వయసులో మళ్లీ పుస్తకాలు పట్టారు. 81 ఏళ్ల వయసులో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తాజాగా ఎంఏ పూర్తి చేశారని లాల్‌చంద్ కుమారుడు సాహిబ్ రామ్ తెలిపారు.

# తేజస్‌లో జపాన్ వాయుసేనాధిపతి గగన విహారం



భారత్ దేశీయంగా అభివృద్ధి చేసిన తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్'లో జపాన్ వాయుసేనాధిపతి జనరల్ తకెహిరో మొరితా గగన విహారం చేశారు. రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ వేదికగా వీర్ గార్డియన్ పేరుతో భారత్, జపాన్ వైమానిక దళాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న విన్యాసాల్లో ఆదివారం ఈ పరిణామం చోటుచేసుకుంది. ఓ కీలక విన్యాసంలో భాగంగా.. వాయుసేన పైలట్ నడిపిన తేజస్ శిక్షణ విమానంలో జనరల్ మొరితా ప్రయాణించారు. భారత సాంకేతిక నవ్యతకు ఈ యుద్ధ విమానం నిదర్శనమని ఆయన ప్రశంసించారు. భారత వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ ఒంటరిగా మరో తేజస్‌లో ప్రయాణించారు. తేజస్‌లో జనరల్ మొరితా గగన విహారం.. భారత దేశీయ యుద్ధ విమానంపై ఆయనకున్న విశ్వాసానికి స్పష్టమైన ఉదాహరణ అని ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ పేర్కొన్నారు. జోధ్‌పుర్ సంయుక్త విన్యాసాల్లో జపాన్ యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. భారత భూభాగంపై ఆ దేశ ఫైటర్ జెట్లు విన్యాసాల్లో పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ నెల 9న ప్రారంభమైన ఈ ఉమ్మడి విన్యాసాలు 22వ తేదీ వరకూ కొనసాగుతాయి.

# భారీగా నకిలీ మందులు.. 16 లైసెన్సులు రద్దు

నకిలీ మందుల విక్రయాలపై కర్ణాటక ట్టింది. నిబంధనలు ఉల్లంఘించిన 16 రిటెయిలర్లు, హోల్‌సేలర్ల ఔషధ లైసెన్సులను రద్దు చేసింది. మరో ఎనిమిది లైసెన్సులను సస్పెండ్ చేసింది. బిడది సమీపంలోని కురుబరకెరనహళ్లి ప్రాంతంలో ఆగస్టు 18న అధికారులు తనిఖీలు చేపట్టారు. ఓ ఫామ్‌హౌస్‌లో నకిలీ మందులు, ప్యాకింగ్ సామగ్రి, యంత్రాలను గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.5.05 కోట్లు ఉంటుందని తెలిపారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి ఔషదాలు కొనుగోలు చేసి.. వాటిని కొత్త సీసాల్లోకి మార్చి ఖరీదైన వాటిగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

అంతర్జాతీయ ఔషధ సంస్థల పేర్లతో నకిలీ లేబుళ్లను తయారు చేసినట్లు అధికారులు గుర్తించారు. వాటిపై ముద్రించిన క్యూఆర్, స్కానింగ్ కోడ్‌లు పనిచేయడం లేదని వెల్లడించారు. ఈ క్రమంలోనే బెంగళూరు రూరల్ జిల్లాలోని ఫైజర్ సీ అండ్ ఎఫ్ డిపో లైసెన్స్‌నూ అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు ఈ డిపో యాజమాన్యం సహకరించకపోవడమే దీనికి కారణమని చెప్పారు. అలాగే అక్కడ గడువు ముగిసిన 30 బాక్సుల మందులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపామని తెలిపారు.






# పుస్తక విధ్వంసాన్ని ఆపలేమా?

ఒకప్పుడు చదవడానికి, సేకరించడానికి, పరిశోధనకు పాత పుస్తకాలను వెతికేవారు. ఇప్పుడు వాటిని వెతికే కొత్త కొనుగోలుదార్లు వచ్చారు. వాళ్లు పుస్తకాన్ని చదవడానికి కాదు, అందులోని సమాచారాన్ని డేటాగా మార్చడానికి కొంటున్నారు. కొని, బైండింగ్ తీసేసి, విడి పేజీలను హైస్పీడ్ స్కానర్లలోకి పంపుతారు. అక్షరాలను యంత్రం చదవగల డేటాగా మార్చేసి మిగిలిన కాగితాన్ని రీసైక్లింగ్‌కు, పల్ప్‌కు పడేస్తారు. ఈ విధానాన్ని 'డిస్ట్రక్టివ్ స్కానింగ్' అంటున్నారు. సమాచారాన్ని కృత్రిమమేధలో నిక్షిప్తం చేయడానికి అరుదైన పుస్తకాలను ధ్వంసం చేయడం న్యాయమేనా?

ఆంథ్రోపిక్ సంస్థకు సంబంధించిన ఒక వ్యాజ్యంలో అమెరికా కోర్టు పత్రాల ద్వారా బయటపడిన 'ప్రాజెక్ట్ పనామా' వివరాలు, ఏఐ శిక్షణ కోసం ముద్రిత పుస్తకాలను భారీ స్థాయిలో కొనుగోలు చేసి స్కాన్ చేసిన విధానంపై స్పష్టమైన సమాచారాన్ని ఇచ్చాయి. ఏయే సంస్థలు ఇలా చేస్తున్నాయన్నది పక్కనపెడితే, కోర్టు పత్రాల్లో నమోదైన వాస్తవాలు, పుస్తక విక్రేతల అనుభవాలు, పరిశ్రమ కథనాలు, ఆరోపణలు... అన్నిటినీ పరిశీలిస్తే ఒక వాస్తవం స్పష్టంగా కనిపిస్తోంది. ఏఐ పరిశ్రమకు నాణ్యమైన కంటెంట్ కావాలి. ఆ పరిశ్రమ ఇప్పుడు ఒక రకమైన డేటా వాల్‌ను ఎదుర్కొంటోంది. గత కొన్ని సంవత్సరాల్లో పెద్ద ఏఐ నమూనాలకు శిక్షణ ఇవ్వడానికి ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న అపారమైన సమాచారం ఉపయోగపడింది. వెబ్‌సైట్లు, ఫోరమ్‌లు, వార్తలు, డిజిటల్ పుస్తకాలు, సామాజిక మాధ్యమాల్లోని భాషలు, యాసలు, సామెతలు, ఇతరత్రా సమాచారం అంతా ఈ ప్రక్రియలో భాగమైంది. కానీ ఇప్పుడు ఇంటర్నెట్ మారిపోయింది. ఏఐ సృష్టించిన టెక్స్ట్ పెరుగుతోంది. దాంతో అదే తిరిగి శిక్షణ డేటాలోకి చేరే ప్రమాదమూ ఎక్కువవుతోంది. మనిషి సృష్టించిన వచనాన్ని, యంత్రం తయారుచేసిన వచనం నుంచి వేరు చేయడం కష్టమవుతోంది. ఇదే సమయంలో ప్రచురణ సంస్థలు, వార్తా సంస్థలు, ఇతర కంటెంట్ యజమానులు తమ డిజిటల్ కంటెంట్‌ను ఏఐ సంస్థలు స్వేచ్ఛగా ఉపయోగించడాన్ని అడ్డుకునేందుకు న్యాయపోరాటాలు చేస్తున్నారు. కాపీరైట్ కేసులు పెరుగుతున్నాయి. లైసెన్సింగ్ ఒప్పందాలు కూడా కుదురుతున్నాయి. అందుకే పుస్తకాలకు ఇప్పుడు కొత్త విలువ వచ్చింది. ముఖ్యంగా ఏఐ విస్తృతంగా ప్రజల్లోకి రాకముందు వెలువడిన పుస్తకాలకు. అవి ఏఐ తాకని మనిషి ఆలోచనకు ప్రత్యక్ష ఆనవాళ్లు. సహజమైన భాష, క్రమబద్ధమైన ఆలోచన, విస్తృతమైన పదసంపద వాటి బలం.

**డిజిటలైజేషన్ అవసరమే కానీ...**

ఒకప్పుడు పాత పుస్తకానికి అరుదైనదన్న ప్రత్యేక విలువ ఉండేది. ఇప్పుడా విలువకు మరో అంశం చేరింది. అది ఏఐ సృష్టి కాదు, మనిషి సృజన. అందుకే గతంలో అరుదుగా అమ్ముడైన ప్రత్యేక అంశాల పుస్తకాలకు అకస్మాత్తుగా భారీ ఆర్డర్లు రావడం, ముద్రణ ఆగిపోయిన అకడమిక్ గ్రంథాలు, ప్రాంతీయ చరిత్రలు, జానపద సాహిత్యం, సాంకేతిక పుస్తకాలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయడం వంటి ఉదాహరణలు వెలుగులోకి వచ్చాయి. పుస్తకాలను కొని స్కాన్ చేయడంలో తప్పు లేదు. ముద్రణ ఆగిపోయిన తర్వాత మళ్లీ కనిపించని ఎన్నో గ్రంథాలు వ్యక్తిగత గ్రంథాలయాల్లో, పాత పుస్తకాల దుకాణాల్లో చివరి ప్రతులుగా ఉండవచ్చు. అలాంటి పుస్తకాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం అత్యవసరమే. గూగుల్ వంటి సంస్థలు గ్రంథాలయ పుస్తకాలను నాన్ డిస్ట్రక్టివ్ పద్ధతుల్లో స్కాన్ చేసిన ఉదాహరణలు ఉన్నాయి. ఇంటర్నెట్ ఆర్కైవ్ కూడా భారీ స్థాయిలో పుస్తకాలను డిజిటలైజ్ చేస్తూ సంరక్షణకు ప్రాధాన్యమిస్తోంది. కానీ ఇప్పుడు ఆ ముద్రిత ప్రతి అంటూ లేకుండా చేయడమే ఆందోళన కలిగిస్తోంది.

**చట్టం ఏమంటోంది?**

పుస్తకాన్ని కొనడం ఒక విషయం, దాన్ని స్కాన్ చేసి కొత్త డిజిటల్ కాపీ తయారు చేయడం మరో విషయం. అమెరికాలోని ఫస్ట్ సేల్ డాక్ట్రిన్ చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భౌతిక కాపీని తిరిగి అమ్మడం, ఇవ్వడం వంటి హక్కులపై హక్కుదారుడి నియంత్రణను పరిమితం చేస్తుంది. కానీ ఆ పుస్తకాన్ని స్కాన్ చేసి కొత్త డిజిటల్ కాపీ సృష్టించడం రిప్రొడక్షన్‌కు సంబంధించిన వేరే ప్రశ్న. 2025లో ఆంథ్రోపిక్ కేసులో అమెరికా కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన పుస్తకాలను డిజిటల్ రూపంలోకి మార్చి, ఆ కాపీలను ఏఐ శిక్షణలో ఉపయోగించడం కొన్ని పరిస్థితుల్లో ఫెయిర్ యూజ్ కిందకు వస్తుందని పేర్కొంది. అంటే కాపీరైట్ యజమాని అనుమతి లేకుండానే ఒక రచనను పరిమిత ప్రయోజనాల కోసం ఉపయోగించేందుకు చట్టం కల్పించే వెసులుబాటు. అదే సమయంలో, పైరేటెడ్ పుస్తకాలను సేకరించి శాశ్వత డిజిటల్ గ్రంథాలయంగా నిల్వ చేయడాన్ని ఫెయిర్ యూజ్‌గా అంగీకరించలేదు. అంటే ఈ తీర్పు ఏఐ సంస్థలకు ఏ పుస్తకాన్ని అయినా ఏ విధంగానైనా కాపీ చేసుకునే హక్కు ఇవ్వలేదు.

**ప్రమాణాలు మారాలి**

ఏఐ అభివృద్ధికి నాణ్యమైన డేటా అవసరం. కానీ అరుదైన, ముద్రణ ఆగిపోయిన, చారిత్రక విలువ కలిగిన, ప్రాంతీయ భాషా సంపదకు చెందిన పుస్తకాల విషయంలో ప్రమాణాలు వేరుగా ఉండాలి. అలాంటి పుస్తకాలకు నాన్ డిస్ట్రక్టివ్ స్కానింగ్‌ను ప్రాధాన్యంగా పెట్టాలి. గ్రంథాలయాలు, ఆర్కైవ్స్, సంరక్షణ సంస్థలతో కలిసి పనిచేయాలి. భౌతిక ప్రతికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలిగించకూడదు. ఎందుకంటే డిజిటల్ కాపీ సమాచారాన్ని ఇస్తే, అసలు ప్రతి చరిత్రను చెబుతుంది. కృత్రిమ మేధ కోసం జరుగుతున్న ఈ పుస్తకాల వేటలో అసలు ప్రశ్న సాంకేతికతను ఆపాలా వద్దా అనేది కాదు. సమాజానికి ఏఐ కావాలి. ఏఐకి మంచి డేటా కావాలి. మానవ జ్ఞానాన్ని డిజిటల్ రూపంలో భద్రపరచాలి. మానవ చరిత్రను, దాని పరిణామక్రమాన్ని, ఆ క్రమంలో ఆవిర్భవించిన నాగరికతలు, సంస్కృతులు, మానవ వికాసానికి సంబంధించిన సమస్త అంశాలను భవిష్యత్ తరాల కోసం సంపూర్ణంగా సంరక్షించాలి. ఆ క్రమంలో పుస్తకం కేవలం డేటా కంటైనర్ కాదు. అది ఒక కాలానికి సాక్ష్యం, ఒక రచయిత ఆలోచనకు భౌతిక రూపం. ఏఐకి పుస్తకంలోని అక్షరాలు డేటా కావచ్చు. మనకు ఆ అక్షరాలతో పాటు వాటిని మోసే పుస్తకం స్పర్శ కూడా కావాలి.



# మౌనంగానే ఉండమని

**2026లో పార్లమెంట్ ఆమోదించిన సవరణ చట్టం 1971 నాటి 'జాతీయ గౌరవాలకు అవమాన నిరోధక చట్టం'లోని సెక్షన్ 3ను మార్చింది. ఇంతవరకు ఈ సెక్షన్ జాతీయగీతం (జనగణమన) ఆలాపనకు అడ్డుపడటాన్ని మాత్రమే నేరంగా చూసేది. ఇప్పుడు అదే రక్షణను జాతీయ గేయం (వందేమాతరం)కు కూడా వర్తింపజేస్తున్నది. ఈ చట్టం ప్రకారం 'వందేమాతరం' పాడుతున్నప్పుడు అడ్డుపడినా, అవమానించినా దానిని నేరంగా పరిగణిస్తారు. అయితే గేయాన్ని పాడకుండా ఎవరైనా మౌనంగా ఉంటే, అది కూడా నేరమేనా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాలంటే ముందు మరో ప్రాథమిక ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలి. మౌనం అంటే ఏమీ చెప్పకపోవడమేనా, లేక అది కూడా ఒక రకమైన వ్యక్తీకరణేనా? మన రాజ్యాంగం దీనికి స్పష్టమైన సమాధానమే ఇస్తున్నది. రాజ్యాంగంలోని 19వ అధికరణ ప్రతి పౌరుడికీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇస్తున్నది. సాధారణంగా మనం దీన్ని 'మాట్లాడే హక్కు'గా అర్థం చేసుకుంటాం. కానీ కోర్టులు దీన్ని మరింత లోతుగా చూస్తున్నాయి. ఒక విషయాన్ని చెప్పే హక్కు ఎంత ముఖ్యమో, చెప్పకుండా ఉండే హక్కు కూడా అంతే ముఖ్యమని నొక్కి చెబుతున్నాయి. ఎవరైనా ఒక విషయాన్ని అంగీకరించినా, అంగీకరించకపోయినా, మౌనం ద్వారానే తన అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. ఆ హక్కును కూడా రాజ్యాంగం కాపాడుతుంది.**

భారత అత్యున్నత న్యాయస్థానం దీన్ని పలు సందర్భాలలో నిరూపించింది. 1986లో బిజోయ్ ఇమాన్యుయేల్ వర్సెస్ కేరళ రాష్ట్రం అనే కేసు మంచి ఉదాహరణ. కేరళలో క్రైస్తవ మత విశ్వాసం కలిగిన ఇద్దరు పిల్లలు జాతీయగీతం పాడేటప్పుడు గౌరవంగా నిలబడేవారు. అయితే జాతీయగీతాన్ని ఆలపించడం లేదని పాఠశాల వారిని బహిష్కరించింది. ఈ కేసులో సుప్రీంకోర్టు గౌరవంగా నిలబడటమే సరిపోతుంది, పాడాలని బలవంతం చేయలేమని, పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్చుకోవాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పుకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛతో పాటు, మతస్వేచ్ఛనిచ్చే 25వ అధికరణ కూడా మద్దతునిచ్చింది. 1978లో నందిని సత్పతి వర్సెస్ పి.ఎల్.దానీ కేసులో, పోలీసుల విచారణలో కూడా మౌనంగా ఉండే హక్కును కోర్టు సమర్థించింది. వేర్వేరు సందర్భాలే అయినా, వీటన్నింటి వెనుక ఉన్న సూత్రం ఒక్కటే. మాట్లాడాలా వద్దా అనేది వ్యక్తి నిర్ణయం. శాసన అధికారం ద్వారా ఒక వ్యక్తి తనకు ఇష్టం లేని విషయాన్ని మాట్లాడాలని బలవంతం చేయడం కుదరదు. ఇదే సూత్రాన్ని ఇతర దేశాలు కూడా అనుసరించాయి. అమెరికాలో 1943లోనే వెస్ట్ వర్జీనియా వర్సెస్ బార్నెట్ కేసులో విద్యార్థులను జెండాకు వందనం చేయాలని బలవంతం చేయలేమని కోర్టు తీర్పు ఇచ్చింది. దేశమేదైనా పౌరుడి నోటిలో బలవంతంగా మాటలు కుక్కడం ప్రజాస్వామ్య విరుద్ధమే.

మరి జాతీయగీతాన్ని గౌరవించాలని కూడా రాజ్యాంగమే చెబుతున్నది కదా? అవును, చెప్పింది. 51ఎ అధికరణ ప్రకారం, జాతీయగీతానికి గౌరవం చూపడం ప్రతి పౌరుడి బాధ్యత. కానీ ఇక్కడ ఒక సూక్ష్మమైన తేడా ఉంది. గేయాన్ని పాడడం మాత్రమే గౌరవం కాదు. గేయంపై గౌరవంతో నిలబడటం, భంగపరచకుండా ఉండటం కూడా గౌరవించడమే. ఉదాహరణకు రాజకీయ సభలు జరుగుతున్న సందర్భంలో మసీదులో కల్మాను చదువుతున్నప్పుడు నాయకులు తమ ప్రసంగాన్ని ఆపి, తర్వాత కొనసాగిస్తారు. నిస్సందేహంగా ఇది గౌరవాన్ని ప్రకటించడమే. వారు కూడా కల్మాను చదివితేనే గౌరవం ప్రకటించినట్లు కాదు కదా? మౌనంగా నిలబడడం కూడా ఒక విధమైన గౌరవ వ్యక్తీకరణలో భాగమే. బాధ్యత, హక్కు ఈ రెండూ కలిసే ఉంటాయి.

ఇప్పుడు 2026లో వచ్చిన కొత్త చట్టాన్ని ఇదే కోణం నుంచి చూద్దాం. ఈ చట్టం వందేమాతరం ఆలాపనకు అడ్డుపడటాన్ని, పాడుతున్నవారిని భంగపరచటాన్ని నేరంగా పరిగణిస్తుంది. ఈ నేరానికి మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంది. అంతేగానీ గేయాన్ని పాడుతున్నప్పుడు మౌనంగా నిలబడి గౌరవాన్ని ప్రకటిస్తున్నవారు నేరస్థులు అని ఈ చట్టం చెప్పడం లేదు. పైన చెప్పిన రాజ్యాంగ సూత్రం ప్రకారం చూస్తే, ఈ మౌనం రాజ్యాంగం కాపాడే వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమే.

అయితే, ఇది రాతలో ఎంత స్పష్టంగా ఉన్నా ఆచరణలో మాత్రం అంత సులభంగా కొనసాగదు. మూడేళ్ల జైలు శిక్ష అనే మాట వినగానే పాఠశాలలు, సంస్థలు భయపడతాయి. రిస్క్ వద్దని అందరినీ పాడమని ఒత్తిడి చేసే అవకాశం ఉంది. ఇదే అసలు సమస్య. చట్టం సరిగ్గానే ఉన్నప్పటికీ, దాన్ని అమలు చేసే చేతుల్లో రాజ్యాంగ సూత్రంపై అవగాహన లేకపోతే, హక్కు ఆచరణలో కనుమరుగవుతుంది.

కాబట్టి వందేమాతరం వివాదంలో అసలు ప్రశ్న గేయం ఎన్ని చరణాలు పాడాలి అన్నది కాదు. మౌనాన్ని కూడా ఒక చెల్లుబాటు అయ్యే వ్యక్తీకరణగా గుర్తించగలమా? అన్నదే అసలు ప్రశ్న. ఈ గుర్తింపు ఉంటేనే గేయానికి గౌరవం, పౌరుని వ్యక్తిగత స్వేచ్ఛ రెండూ కలిసి నిలబడతాయి. ఒకటి లేకపోతే మరొకటి అసంపూర్ణమే. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. ఈ విధంగా మౌనంగా ఉండే హక్కు వందేమాతరం విషయంలో సరిగ్గా ఇలాగే వర్తిస్తుందని ఇంతవరకు ఏ కోర్టూ నేరుగా తేల్చలేదు. ఇది గతంలో జాతీయగీతంపై వచ్చిన తీర్పుల ఆధారంగా చేసిన హేతుబద్ధమైన అంచనా మాత్రమే.

అన్ని వర్గాల వారు ఇతరుల విశ్వాసాలను కూడా గౌరవిస్తూ చేయి చేయి కలిపి ముందుకు సాగినప్పుడే నిజమైన స్వేచ్ఛ అనుభవయోగ్యం అవుతుంది. కాబట్టి పాడుతున్న వారికి అభ్యంతరం చెప్పకుండా, పాడని వారిని బలవంతం చేయకుండా ఉండగలిగే సంస్కారమే ఈ దేశానికి నిజమైన రక్షణ కవచం.

# మణిపూర్‌ను చక్కదిద్దలేరా!

**గత మూడేళ్లుగా అనుచిత కారణాలవల్లే ఎప్పుడూ వార్తల్లో ఉంటున్న మణిపూర్ మళ్లీ ప్రతీకారేచ్ఛతో రగులుతోంది. 2023 మేలో మొదలైన జాతుల ఘర్షణలు ఎప్పుడూ పెద్దగా ఆగిందేమీ లేదుగానీ... మీడియాలో ప్రముఖంగా వచ్చేంత పెద్ద సంఘటనలు జరగలేదు. కానీ ఆ స్వల్పకాల నిశ్శబ్దం కాస్తా గత ఆదివారం బద్దలైంది. ఆ రోజు తమెంగ్లాంగ్ జిల్లాలోని టోలెన్ గ్రామంలో వేకువజామున ఒక మహిళతో సహా నలుగుర్నిదుండగులు కాల్చిచంపారు. అటుతర్వాత సాయంకాలం అదే జిల్లాలో లోంగ్పి అనే గ్రామంలో ఒక యువకుణ్ణి, మహిళను కాల్చిచంపారు. మొదటి దాడి కుకీ ప్రాబల్య గ్రామంలో నాగాలే లక్ష్యంగా జరిగితే, రెండో దాడి నాగాలు మెజారిటీగావున్నచోట కుకీలపై జరిగింది. 1992–97 మధ్య కుకీ–నాగాల ఘర్షణల్లో బలైనవారి స్మారకార్థం ఆదివారం కుకీలు 'బ్లాక్ డే' పాటించిన రోజునే ఈ రెండు దాడులూ చోటుచేసుకోవడం గమనించదగింది. మణిపూర్ పలు జాతులకు నిలయం. ఇన్ని దశాబ్దాల పాలనలో భిన్న రాజకీయపక్షాల నాయకులు గద్దెనెక్కినా, ఏ ఒక్కరూ ఆ జాతులమధ్య సామరస్య వాతావరణాన్ని నెలకొల్పలేకపోయారు.**



2023 నాటి ఘర్షణల సమయంలో అప్పటి బీజేపీ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రధాన తెగలైన మెయితీ-కుకీల మధ్య పరస్పర హననం సాగుతుంటే, దాన్ని భద్రతా బలగాలకూ, కుకీ మిలిటెంట్లకూ మధ్య సాగుతున్న ఘర్షణగా చిత్రించే యత్నం చేశారు. చివరకు భద్రతా బలగాలే బీరేన్ సింగ్ ప్రకటనను ఖండించాల్సి వచ్చింది. ఆ ఘర్షణల్లో దాదాపు 300 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ వారిలో చాలా మంది సహాయ శిబిరాల్లోనే బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది.

కొందరు ఇప్పుడిప్పుడే గ్రామాలకు వెళ్తున్న తరుణంలో మళ్లీ హింస చెలరేగింది. మెయితీల ఆధిక్యతగల ఇంఫాల్ లోయలో 2023లో వారివైపు నుంచి హింస మొదలైనప్పుడు అదుపు చేయగలిగి ఉంటే సమీప కొండ ప్రాంతాల్లోని కుకీలు రెచ్చిపోయేవారు కాదు. అయితే మూడేళ్లనాటి హింసకూ, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సాగుతున్న హింసకూ మౌలికంగా వ్యత్యాసం ఉంది. అప్పట్లో వందలమంది గుంపులుగా ఊళ్లపైబడి దాడులు చేశారు. ఇళ్లకు నిప్పంటించటం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడటంవంటివి చోటు చేసుకున్నాయి.

కానీ ఇప్పుడు చడీచప్పుడూ లేకుండా వచ్చి దాడులు చేసి పోతున్నారు. అలాగే మొన్నటివరకూ ప్రధానంగా మెయితీ-కుకీ తెగలమధ్యే ఘర్షణలుండగా, మూడు దశాబ్దాల క్రితం నాటి ఉదంతాలను గుర్తు తెస్తూ ఇప్పుడు కుకీ-నాగా జాతులమధ్య వైరం సాగుతోంది. మెయితీలు తమను సైతం గిరిజనులుగా గుర్తించాలని డిమాండ్ చేయగా, దాన్ని కుకీలు వ్యతిరేకించారు. ఇప్పుడు కుకీలు, నాగాలూ క్రైస్తవులే అయినా వారిమధ్య భూమి విషయంలో కొట్లాటలు సాగుతున్నాయి. బీరేన్ సింగ్ ప్రభుత్వం పోయి, కొన్నాళ్లు రాష్ట్రపతి పాలన కొనసాగి మొన్న ఫిబ్రవరిలో ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యంలో కొత్త సర్కారు ఏర్పడింది.

నిండా రెండునెలలు కూడా ప్రశాంతత లేకుండా నాగా-కుకీలమధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఒక మహిళపై అత్యాచారం కూడా చోటుచేసుకుంది. ఇవన్నీ సహాయ శిబిరాల్లో జరిగినవే. ఈ ఉదంతాలపై సమగ్ర నివేదిక కావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మరణాలపై లోగడే సర్వోన్నత న్యాయస్థానం త్రిసభ్య సంఘాన్ని నియమించగా, ఆ సంఘం 25 అసహజ మరణాలను ప్రస్తావించింది.

వీటిపై జూన్ 11నుంచి వివరణ కోరుతున్నా, ఇంతవరకూ జవాబులేదని ఆ సంఘం చెప్పటంపై ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది.

మృతుల వారసులకు అరకొర ఆర్థికసాయం అందించటంపైనా నిలదీసింది. మొత్తంగా 8 జిల్లాల్లోని శిబిరాల్లో 640 మంది మరణించగా, అందులో 34 మంది మరణాలు అసహజమైనవని తేలింది. కానీ 25 మృతదేహాలకు మాత్రమే పోస్టుమార్టం జరిపించారు. ఈ వరస చూస్తుంటే పాలకులు మారినా మారిందేమీ లేదని అర్థమవుతోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాలు సమగ్రంగా చర్చించుకుని తగిన కార్యాచరణకు దిగనట్టయితే అక్కడ శాంతిభద్రతలు మరింత క్షీణించటం ఖాయం.

# బయోటెక్నాలజీలో ఏఐ విప్లవం

డీఎన్ఏ ఆవిష్కరణ జీవశాస్త్రాన్ని మార్చివేసింది. ఇప్పుడు మరో విప్లవానికి రంగం సిద్ధం అవుతోంది. జెనోమిక్స్, బయోటెక్నాలజీ, సింథటిక్ బయాలజీలతో కలిసి కృత్రిమ మేధ జీవ వ్యవస్థలను అర్థం చేసుకోవడంతోపాటు, కొత్త వ్యవస్థల రూపకల్పన మొదలుపెట్టింది. ఈ పరిణామం వైద్యం, పర్యావరణం, వ్యవసాయం, ఫార్మా రంగాల తీరుతెన్నులను మార్చగలదు. ప్రతి జీవకణం తన డీఎన్ఏలో నిక్షిప్తమై ఉన్న సమాచారం, సూచనల ఆధారంగా పనిచేస్తుంది. ఈ సూచనలు ఏటీజీసీ అనే నాలుగు రసాయన అక్షరాల మిశ్రమాలుగా ఉంటాయి. ఆ జెనెటిక్ కోడ్ జీవి ఎదుగుదల, వ్యాధి నిరోధకత, ఇతర జీవక్రియలను నియంత్రిస్తుంది. డీఎన్ఏ భాగాలు స్విచ్‌ల తరహాలో పనిచేస్తూ, జన్యువులు ఎప్పుడు ఎక్కడ క్రియాశీలకం కావాలో నిర్ణయిస్తాయి. ఒక జన్యువు లోపభూయిష్టంగా ఉండటం వల్లే కాకుండా, జన్యువు తప్పు సమయంలో ఆన్ లేదా ఆఫ్ కావడం వల్ల కూడా వ్యాధి ఉత్పన్నం కావచ్చు. 1990లలో శాస్త్రవేత్తలు మొదట సూక్ష్మజీవులు, మొక్కల జన్యువులను (జీనోమ్) డీకోడ్ చేశారు. ఆ తర్వాత మానవ జీనోమ్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు. ఇది భారీ మొత్తంలో జీవసంబంధ సమాచారాన్ని అందించింది. ఈ డేటా నిల్వకు, విశ్లేషణకు కంప్యూటర్లు కీలకంగా మారాయి. మానవ జీనోమ్ ప్రాజెక్ట్, డీఎన్ఏ సీక్వెన్సింగ్ టెక్నాలజీలు సృష్టించిన సమాచారాన్ని అర్థం చేసుకోవడానికి ఏఐ అమోఘంగా తోడ్పడుతోంది.

**మలి దశలో మరింత పురోగతి**

గూగుల్ డీప్‌మైండ్ రూపొందించిన 'ఆల్ఫాఫోల్డ్' ఏఐ వ్యవస్థ ప్రోటీన్ నిర్మాణాలను నిక్కచ్చిగా అంచనా వేయగలదు. అది ప్రపంచవ్యాప్తంగా బయోమెడికల్ పరిశోధనలను మార్చేస్తోంది. శాస్త్రవేత్తలు ఇప్పుడు డీ




ఎన్ఏను సొంతంగానే అధ్యయనం చేయగల అధునాతన ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నారు. మనుషులు భాషను అర్థం చేసుకునే విధంగానే జీనోమ్ లాంగ్వేజ్ మోడల్స్ అనే ఏఐ వ్యవస్థలు డీఎన్ఏ క్రమాలను అర్థం చేసుకుంటాయి. భాషలోని పదాలు, వాక్యాలను మనం నేర్చుకునే మాదిరిగానే, ఈ ఏఐ సిస్టమ్‌లు డీఎన్ఏ క్రమాల మధ్య సంబంధాలను నేర్చుకుంటాయి. క్రమంగా కొత్త క్రమాలను రూపొందించగలుగుతాయి. ఈ అంశాన్ని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకుల బృందం తాజాగా ధ్రువీకరించింది.

నేడు యాంటీబయోటిక్స్ వల్ల అనేక వ్యాధులు నయమవుతున్నాయి. కానీ, వాటిని విచక్షణారహితంగా వాడటం వల్ల, మందులకు లొంగని శక్తిని బ్యాక్టీరియా సంతరించుకుంటోంది. దీంతో ఒకప్పుడు సులభంగా నయం చేయగల అంటువ్యాధులు ఇప్పుడు మొండిగా తయారవుతున్నాయి. ఇలాంటి మొండి వ్యాధికారక బ్యాక్టీరియాను అంతం చేయగల వైరస్‌లను బ్యాక్టీరియోఫేజ్ అంటారు. అలాంటి వాటికోసం ప్రకృతిలో వెతకడంకన్నా సొంతంగా రూపొందించాలని ఎవో1, ఎవో2 అనే ఏఐ మోడల్స్‌కు శాస్త్రవేత్తలు పురమాయించారు. అవి బ్యాక్టీరియాను చంపగల క్రియాశీల బ్యాక్టీరియోఫేజ్‌లను ఉత్పత్తి చేశాయి. ఇది నిజంగా విప్లవాత్మకం. ఏఐ సృష్టించిన వైరస్ బ్యాక్టీరియాను మాత్రమే హతమారుస్తుంది తప్ప మనుషులకు హానిచేయదు. ఇదివరకు ఒక కొత్త మందును అభివృద్ధి చేయాలంటే చాలా సంవత్సరాలు, భారీ పెట్టుబడులు అవసరమయ్యేవి. ఏఐ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. లక్షలాది రసాయన సమ్మేళనాలను వేగంగా విశ్లేషించి, ఉపయోగకరమైన ఔషధాలను గుర్తించగలదు.

దేశంలోని ప్రధాన ఫార్మాస్యూటికల్, వ్యాక్సిన్ తయారీ కేంద్రాల్లో ఒకటైన హైదరాబాద్‌కు ఇది చాలా కీలక పరిణామం. జీనోమ్ వ్యాలీలోని కంపెనీలు ఔషధాల ఆవిష్కరణ, వ్యాధి నిర్ధారణ, వ్యాక్సిన్ అభివృద్ధి, ప్రెసిషన్ మెడిసిన్‌లలో ఏఐని ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. ఏఐ ఒక వ్యక్తి జన్యు ప్రొఫైల్‌ను విశ్లేషించి, ఆ రోగికి బాగా సరిపోయే చికిత్సలను ఎంచుకోవడానికి వైద్యులకు సాయపడుతుంది. మరోవైపు మొక్కల్లో కూడా కరవును తట్టుకోవడం, వ్యాధి నిరోధకత, లవణీయతను తట్టుకునే శక్తి, పంట దిగుబడి వంటివీ జన్యువులపై ఆధారపడి ఉంటాయి. ఈ నేపథ్యంలో ఇక్రిశాట్, ఐకార్, ఐఆర్ఆర్ఐ, ఐఎంఆర్ఐ, సీఎస్ఐఆర్‌సీసీఎంబీ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఇప్పటికే జన్యు ఆధారిత పంటల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యవసాయ రంగం కూడా ఏఐ ఆధారిత బయోటెక్నాలజీ ద్వారా ఎంతో ప్రయోజనం పొందవచ్చు.

**జాగ్రత్తలు అవసరం**

కంప్యూటర్ విజన్ సాంకేతికత కలిగిన డ్రోన్లు పంట ఆరోగ్యాన్ని పర్యవేక్షించగలవు. వ్యాధులను ముందే గుర్తించగలవు. పోషకాల లోపాలను అంచనా వేయగలవు. ఎరువులు, పురుగుల మందుల వినియోగానికి మార్గనిర్దేశనం చేయగలవు. వాతావరణం, నేల, ఉపగ్రహ డేటాను ఏఐతో విశ్లేషించడం ద్వారా రైతులు పంటలకు సలహాలను అందుకోవచ్చు. ఇన్ని గొప్ప ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఏఐ అనేది మంత్రదండమేమీ కాదు. ఏఐ అంచనాలను ఎప్పటికప్పుడు ప్రయోగాల ద్వారా ధ్రువీకరించాలి. డేటా గోప్యత, జెనెటిక్ ఎడిటింగ్, ఆరోగ్య సంరక్షణ సాంకేతికతలను అందరికీ సమానంగా అందించడానికి నైతిక విలువలను పాటించాలి. బయోటెక్నాలజీ పరిశోధకులు జీవశాస్త్రంతో పాటు కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, డేటా అనాలిసిస్ కూడా నేర్చుకోవాలి. అందుబాటులోకి వస్తున్న అవకాశాలను ఉపయోగించుకుంటే ఆరోగ్య సంరక్షణ, సుస్థిర వ్యవసాయం, బయోఇండస్ట్రియల్ అభివృద్ధిలో భవిష్యత్తు ఆవిష్కరణలకు తెలుగు రాష్ట్రాలు ప్రధాన కేంద్రాలు కాగలవు.



# గురజాడ జయంతి ఘనంగా వేడుకలు

**- సామాజిక సంస్కరణలకు గురజాడ చేసిన సేవలు చిరస్మరణీయం: ఆర్డీవో....**



**ధర్మవరం సెప్టెంబర్ 21 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలను ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలను తన రచనల ద్వారా ఎత్తిచూపి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో గురజాడ అప్పారావు కీలక పాత్ర పోషించారని ఆర్డీవో పేర్కొన్నారు. 'కన్యాశుల్కం' వంటి రచనలతో సామాజిక సంస్కరణలకు బాటలు వేసిన గురజాడ, 'దేశమును ప్రేమించుమన్నా' వంటి రచనల ద్వారా ప్రజల్లో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించారని కొనియాడారు.
తెలుగు సాహిత్య రంగానికి గురజాడ అందించిన సేవలు, సమాజ మార్పు కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని గురజాడ అప్పారావుకు నివాళులర్పించారు.

# విండ్‌మిల్స్ భూసేకరణ, ఇసుక అక్రమ రవాణాపై విచారణ జరపాలి

**- తహసీల్దార్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల వినతి**




**కళ్యాణదుర్గం, కంబదూరు, సెప్టెంబర్ 21:అనంత జనశక్తి న్యూస్**

కంబదూరు మండలంలో విండ్‌మిల్స్ ఏర్పాటు ప్రక్రియలో భూసేకరణ అక్రమాలు, ఆలయ మాన్యం భూముల ఆక్రమణ, అక్రమ ఇసుక రవాణాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.మండలంలో ఏర్పాటు చేస్తున్న విండ్‌మిల్స్ సంఖ్య, సర్వే నంబర్లు, భూసేకరణ వివరాలు, రైతులకు ఎకరాకు చెల్లిస్తున్న నష్టపరిహారం తదితర వివరాలను ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాలు బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు.రాళ్లపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి, శివాలయాలకు చెందిన సర్వే నంబర్లు 97, 99లోని 57.67 ఎకరాల దేవుని మాన్యం భూముల్లో చెట్లను నరికివేసి, అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.అలాగే రాళ్ల అనంతపురం సమీపంలోని పెన్నా నది పరివాహక ప్రాంతాల నుంచి చిన్నంపల్లి, నూతిమడుగు వరకు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని ఆరోపిస్తూ, అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు, కల్వర్టులు, తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతిన్నాయని, వాటిని సంబంధిత కంపెనీల ఖర్చుతో పునరుద్ధరించాలని కోరారు.రైతులకు, దేవాలయాలకు న్యాయం జరిగే వరకు, ఆరోపణలపై లిఖితపూర్వక సమాధానం ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కంబదూరు మండల కేంద్రంలో శాంతియుత నిరసన, నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ గొల్ల హనుమంతరాయుడు, టౌన్ కన్వీనర్ వడ్డే వెంకటప్ప, జడ్పీటీసీ నాగరాజు, ఎంపీపీ భీమేష్, జిల్లా పార్టీ కార్యదర్శి ఆదప్ప, మాజీ సర్పంచ్ అమర్‌నాథ్, బీసీ సెల్ అధ్యక్షుడు అండేపల్లి తలారి రమేష్, రాళ్లపల్లి సామంతరెడ్డి, ఎంపీటీసీ మల్లేష్, రవి, మాజీ వార్డు మెంబర్ రాజు, యువజన విభాగం అధ్యక్షుడు రాళ్ల అనంతపురం రవి, కుమ్మర గంగాధర్, చెన్నంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, రాళ్లపల్లి గంగాధర్, మాజీ డీలర్ మారెప్ప, ములకనూరు దేవేంద్ర, కుర్లపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**- 3.68 లక్షల మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ**
**- విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్య ఆరోగ్య శాఖ: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**




**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 21 :అనంత జనశక్తి న్యూస్**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు.జిల్లాలోని 5,366 విద్యాసంస్థల్లో సుమారు 3.68 లక్షల మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. పిల్లల్లో నులిపురుగుల వల్ల రక్తహీనత, ఆకలి మందగించడం, నీరసం, అతిసారం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ఇవి వారి శారీరక, మానసిక వికాసంపై ప్రభావం చూపుతాయని తెలిపారు.పరిసరాల పరిశుభ్రత లోపించడం, కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం వంటి కారణాలతో నులిపురుగులు వ్యాప్తి చెందుతాయని అధికారులు పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్య భద్రత దృష్ట్యా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.

**మాత్రల మోతాదు:**
**- 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు: 200 మి.గ్రా. అల్బెండజోల్**
**- 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు: 400 మి.గ్రా. అల్బెండజోల్**

వైద్య సిబ్బంది పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి తమ పర్యవేక్షణలోనే పిల్లలకు మాత్రలు అందించేలా చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 25, 2026న ప్రధాన కార్యక్రమం నిర్వహించనుండగా, ఆరోజు హాజరు కాని పిల్లల కోసం అక్టోబర్ 5, 2026న మాప్‌అప్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో కొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఫైరోజా బేగం, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, ఐసీడీఎస్ పీడీ ప్రమీలతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మెరిట్‌తో ఉద్యోగాలు సాధించిన డీఎస్సీ టీచర్లపై వైసీపీ మూకల దాడి దుర్మార్గం.. ప్రజాస్వామ్యానికి మచ్చ

**- గురువులపై రాళ్లు, రాడ్లు, కర్రలతో గుండాల దాడిని తీవ్రంగా ఖండించిన దేవినేని ఉమా**
**- టీచర్లను ఏ బ్రాండ్ ఎక్కువ తాగుతున్నారో చెప్పాలంటూ మందు షాపుల దగ్గర కాపలా పెట్టిన నీచ సంస్కృతి గొడ్డలి పార్టీదన్న మాజీ మంత్రి**
**- సమాజంలో అశాంతి రేపాలనే కుట్రతో సజ్జల ఆదేశాలతోనే బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లతో భౌతిక దాడులకు పాల్పడ్డారని విమర్శ**




**గొల్లపూడి సెప్టెంబర్ 21, అనంత జనశక్తి న్యూస్**

మెరిట్‌తో ఉద్యోగాలు సాధించిన డీఎస్సీ ఉపాధ్యాయులపై భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలోని తన కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. గురువులపై రాళ్లు, రాడ్లు, కర్రలతో దాడులను తీవ్రంగా ఖండించారు. ఏ బ్రాండ్ ఎక్కువ తాగుతున్నారో చెప్పాలంటూ మందు షాపుల దగ్గర టీచర్లను కాపలా పెట్టిన నీచ సంస్కృతి గొడ్డలి పార్టీదని సమాజంలో అశాంతి రేపాలనే కుట్రతో సజ్జల ఆదేశాలతోనే బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లతో భౌతిక దాడులకు పాల్పడ్డారని మండిపడ్డారు. విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్న గొడ్డలి పార్టీ అధ్యక్షుడు సిబిఐ విచారణ అంటూ మాట్లాడడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు.మైదానాల్లో ఏళ్ల తరబడి శ్రమించి సాధించిన సర్టిఫికెట్లతో మెరిట్ తో ఉద్యోగాలు పొందిన టీచర్లను మానసికంగా వేధించడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఉమా విమర్శించారు. జాతీయ స్థాయిలో రాణించి, రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన క్రీడాకారుల ప్రతిభను 'ఫేక్' అంటూ అవమానించడం వారి కష్టాన్ని అవమానించడమేనన్నారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ప్రచారానికి అభ్యర్థులు ఆధారాలతో తమ వద్ద ఉన్న ఒరిజినల్ సర్టిఫికెట్లు, క్రీడా విజయాలకు సంబంధించిన ఆధారాలను చూపి సమాధానం చెప్పినా, దుష్ప్రచారం కొనసాగించడం వారి అహంకారానికి నిదర్శనం అన్నారు. గతంలో ప్రభుత్వమే జారీ చేసిన సర్టిఫికెట్లను ఇప్పుడు ఫేక్ అంటూ ఆరోపణలు చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు శాప్ సిబ్బంది, విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులు చేయడం ప్రభుత్వ వ్యవస్థను భయపెట్టే ప్రయత్నమని ఉమా అన్నారు. టీచర్లు తల పగలగొట్టి సభ్య సమాజం తలదించుకునేలా భాష బూతు భాషతో దూషించి దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ఒక్క మెగా డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను నిరాశకు గురిచేసిందని ఉమా విమర్శించారు. డీఎస్సీని అడ్డుకునేందుకు వైసిపి వందల కేసులు వేసినా న్యాయపరమైన సవాళ్లు అధిగమించి మెగా డీఎస్సీ నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. "డీఎస్సీ అంటే తెలుగుదేశం.. తెలుగుదేశం అంటే డీఎస్సీ" అని పేర్కొంటూ, ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యత అని ఉమా అన్నారు. వైసీపీ అరాచక రాజకీయాలను ప్రజలు సహించేందుకు సిద్ధంగా లేరని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతో గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పబోతున్నారని ఉమా అన్నారు.

# మేజిస్ట్రేట్ అనుమతి ఉండాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం ప్రతీ పౌరుడికి తన అరెస్టుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలుసుకునే ప్రాథమిక హక్కు ఉందని ధర్మాసనం పునరుద్ఘాటించింది. నేరం తీవ్రతతో సంబంధం లేకుండా.. యూఏపీఏ, పీఎంఎల్ఏ వంటి కఠినమైన ప్రత్యేక చట్టాల కింద నమోదైన కేసులకు కూడా ఈ రాజ్యాంగ నిబంధన పవిత్రమైనదని, తప్పనిసరిగా పాటించాల్సిందేనని పేర్కొంది. ఒకవేళ ఆర్టికల్ 22(1) ఉల్లంఘనకు గురై నిందితుడు విడుదల అయితే.. మళ్లీ అరెస్ట్ చేయడానికి మేజిస్ట్రేట్‌కు దరఖాస్తు చేసుకునే ముందు సదరు నిందితుడికి అరెస్ట్ కారణాలను రాతపూర్వకంగా అందించాలని చెప్పింది.
అలాగే మొదట నిబంధనలకు విరుద్ధంగా అరెస్ట్ చేసిన పోలీసు అధికారి తక్షణ పైఅధికారి ఆ దరఖాస్తుపై ఆమోద సంతకం చేయాల్సి ఉంటుందని కోర్టు నిబంధన విధించింది. అంతేకాకుండా ఆర్టికల్ 22(1)ను ఉల్లంఘించి మొదటి అరెస్టుకు బాధ్యుడైన పోలీసు అధికారిపై విధిగా శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది.
రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అధికారి చేతిలోనే మళ్లీ అరెస్ట్ చేసే విచక్షణాధికారాన్ని వదిలేయకూడదని, దానిని న్యాయపరంగా నియంత్రించాల్సిన అవసరం ఉందో అని జస్టిస్ భూయాన్ వ్యాఖ్యానించారు. మేజిస్ట్రేట్‌కు సమర్పించే పిటిషన్‌లో మొదటిసారి అరెస్ట్ చేసినప్పుడు నిందితుడికి కారణాలు ఎందుకు తెలపలేకపోయారో సహేతుకంగా వివరించాల్సి ఉంటుంది. దరఖాస్తును పరిశీలించిన మేజిస్ట్రేట్.. పోలీసులు తెలిపిన విన్నపం నిజాయితీతో కూడుకున్నదని భావించి, తదనంతర కాలంలో నిందితుడికి కారణాలు అందించబడ్డాయని, అతడిని మళ్లీ అరెస్ట్ చేయడం అత్యవసరమని సంతృప్తి చెందితేనే రీఅరెస్ట్‌కు అనుమతినిచ్చే ఉత్తర్వులు జారీ చేస్తారు. అలాగే ప్రధాన కారణంగా ఆర్టికల్ 22(1) ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో ఆ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ బాధ్యతలను సదరు పాత అధికారి నుంచి తప్పించి, మరొక అధికారికి అప్పగించాలని సుప్రీం కోర్టు తన తీర్పులో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.



# నల్ల దుస్తులతో కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది నిరసన




**- 100 శాతం స్థూల వేతనం......**
**- ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని డిమాండ్.....**

**ధర్మవరం సెప్టెంబర్ 21 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది సోమవారం నల్ల దుస్తులు ధరించి నిరసన చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బందికి 100 శాతం స్థూల వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్నప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది హెచ్చరించారు.

# అనంతగిరి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం




**విద్యార్థుల అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తించిన మండల పరిషత్ సభ్యులు, అధికారులు**

**అనంతగిరి,సెప్టెంబర్ 21:అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా యంత్రాంగం ఇటీవల అనంతగిరి మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సోమవారం అనంతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.మండల పరిషత్ సభ్యులు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, ప్రతిభా వికాసం కోసం వారు అందించిన సేవలను కొనియాడారు.ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తూ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఇతర ఉపాధ్యాయులకు కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు.


# గురజాడ జయంతి ఘనంగా వేడుకలు



**- సామాజిక సంస్కరణలకు గురజాడ చేసిన సేవలు చిరస్మరణీయం: ఆర్డీవో....**

**ధర్మవరం సెప్టెంబర్ 21 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలను ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలను తన రచనల ద్వారా ఎత్తిచూపి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో గురజాడ అప్పారావు కీలక పాత్ర పోషించారని ఆర్డీవో పేర్కొన్నారు. 'కన్యాశుల్కం' వంటి రచనలతో సామాజిక సంస్కరణలకు బాటలు వేసిన గురజాడ, 'దేశమును ప్రేమించుమన్నా' వంటి రచనల ద్వారా ప్రజల్లో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించారని కొనియాడారు.
తెలుగు సాహిత్య రంగానికి గురజాడ అందించిన సేవలు, సమాజ మార్పు కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని గురజాడ అప్పారావుకు నివాళులర్పించారు.


# వైసీపీ రౌడీలను వదిలిపెట్టం వారిని కఠినంగా శిక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)



అత్యుత్తమ ఆటతీరుతో రాష్ట్రం, దేశ సత్తాను ప్రపంచానికి చాటిన క్రీడాకారులను స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు అంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని వ్యాఖ్యానించారు.
జగన్ ఫేక్ ముఠా తప్పుడు నిందలతో అవమానాలు పాలైన స్పోర్ట్స్ కోటా డీఎస్సీ 2025 టీచర్లు తమకు న్యాయం చేయాలంటూ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని మంత్రి తెలిపారు. క్రీడలతో దేశ పతాకాన్ని రెపరెపలాడించి, ప్రతిభతో టీచర్ ఉద్యోగం సాధించిన స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ ఫ్యాక్షన్ ముఠా శాప్ కార్యాలయం వద్ద దాడికి దిగిందని మండిపడ్డారు. రౌడీ షీటర్లు, గంజాయి బ్లేడ్ బ్యాచులను టీచర్లపైకి ఉసిగొల్పడం జగన్ నేర మనస్తత్వాన్ని బయటపెట్టిందని విమర్శించారు. పూజించాల్సిన గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేసిన జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలన్నారు. వైసీపీ ప్రేరేపిత రౌడీ షీటర్లు, గంజాయిబ్లేడ్ బ్యాచుల పనిపడతామంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్ట్ చేశారు.

## బోర్లు ఉన్న ప్రతి రైతుకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించాలి



**శెట్టూరు, సెప్టెంబర్ 21 (అనంత జనశక్తి న్యూస్):**

బోరు ఉండి నీటి లభ్యత ఉన్న ప్రతి రైతుకు సూక్ష్మ నీటిపారుదల పథకం కింద డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.శెట్టూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో డ్రిప్ ఇరిగేషన్ కంపెనీల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. కళ్యాణ దుర్గం ఏపీడీలు జి. చంద్రశేఖర్, ఫిరోజ్ ఖాన్, ఏపీడీఎంఐఓ మల్లేష్‌తో పాటు వివిధ కంపెనీల డీసీఓలు, ఎఫ్‌సీఓలు, ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కరువు పరిస్థితులు, వర్షపాతం తగ్గడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయని తెలిపారు. దీంతో పండ్ల తోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు ప్రమాదంలో ఉన్న ప్రాంతాలను ఆర్ఎస్‌కే పరిధిలో గుర్తించాలని సూచించారు.బోరు ఉండి నీరు ఉన్న ప్రతి రైతును సూక్ష్మ నీటిపారుదల పథకంలో రిజిస్ట్రేషన్ చేయించాలని, రిజిస్ట్రేషన్ అనంతరం రైతు పొలంలో సర్వే నిర్వహించి, రైతు చెల్లించాల్సిన నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించిన వెంటనే కంపెనీలు క్షేత్రస్థాయిలో యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పథకం నిబంధనలను రైతులకు పూర్తిగా వివరించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సూక్ష్మ నీటిపారుదల పథకం విజయవంతానికి అధికారులు, కంపెనీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం



**అనంతపురం, సెప్టెంబర్ 21: అనంత జనశక్తి న్యూస్**

ప్రజా సమస్యల పరిష్కారానికే పోలీసు యంత్రాంగం తొలి ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ తెలిపారు.సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం (PGRS) కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 129 అర్జీలు స్వీకరించారు.పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో సమగ్రంగా విచారించి, బాధితులకు వేగంగా, పారదర్శకంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కుటుంబ తగాదాలు తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. పిజిఆర్ఎస్‌కు వచ్చిన పిటిషనర్లు, వారి సహాయకులకు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం అందించారు.

## మహిళల భద్రతకు ‘శక్తి’ యాప్ కవచం



**అనంతపురం, సెప్టెంబర్ 21: అనంత జనశక్తి న్యూస్**

మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ‘శక్తి’ యాప్‌పై పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మహిళా పోలీసులు, శక్తి టీమ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో మహిళలు, విద్యార్థినులతో మాట్లాడి వారి మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసులను సంప్రదించే విధానాన్ని ప్రత్యక్షంగా వివరిస్తున్నారు.ప్రధాన ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వేధింపులు లేదా ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు శక్తి యాప్ ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని సూచిస్తున్నారు.అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత పాటించాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి మహిళ తమ భద్రత కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమాల్లో మహిళా పోలీసులు, శక్తి టీమ్ సిబ్బంది, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్ల స్థలాల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 21,అనంత జనశక్తి న్యూస్**



పేదల ఇళ్ల స్థలాల పంపిణీలో అక్రమాలకు తావులేకుండా అర్హులను పారదర్శకంగా ఎంపిక చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సిపాన గుణవతి కోరారు. నిజమైన నిరుపేదలకు మాత్రమే ఇళ్ల స్థలాలు అందేలా ఆధార్, రేషన్ కార్డు, ఇల్లు, భూమి, ఇతర ఆస్తుల వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రాజకీయ జోక్యం, దళారుల ప్రమేయాన్ని అరికట్టాలని, అనర్హులకు ప్రయోజనం కల్పిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇళ్ల స్థలాల పంపిణీపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆమె కోరారు. ప్రభుత్వ పథకం అర్హులైన పేదలకు చేరేలా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డాక్టర్ గుణవతి విజ్ఞప్తి చేశారు.

## వినాయక చవితి సందర్భంగా శ్రీ సాయి టిఫిన్స్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం



**సరోూర్‌నగర్ సెప్టెంబర్ 21:అనంత జనశక్తి న్యూస్**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సాయి టిఫిన్స్, సరోూర్‌నగర్ వెటర్నరీ హాస్పిటల్ ఎదురుగా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300-350 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో శరణ్ కుమార్, ఆర్. అరవింద్ యాదవ్, రాజు ప్రత్యేకంగా పాల్గొని కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించారు.
శరణ్ కుమార్ | ఆర్. అరవింద్ యాదవ్ | రాజు ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలందరికీ హృదయపూర్వక గణేష్ చతుర్థి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ వినాయకుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు నెలకొనాలని ఆకాంక్షించారు.

# వికలాంగుల కమ్యూనిటీ హాల్ను వారి అవసరాలకే వినియోగించాలి

**- వి హెచ్ పి ఎస్ కమిటీ వైస్ చైర్మన్ అందే రాంబాబు**

**హయత్ నగర్ సెప్టెంబర్ 21 (అనంత జనశక్తి)**

హయత్ నగర్ మండల కార్యాలయ ఆవరణలో నిర్మించిన వికలాంగుల కమ్యూనిటీ హాల్ను వికలాంగుల అవసరాల కోసమే వినియోగించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వి హెచ్ పి ఎస్) కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందే రాంబాబు డిమాండ్ చేశారు.
వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్మెట్ ఎంపీడీవో శ్రీ వాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2013లో బీఎంపీఆర్వై నిధుల కింద హయత్నగర్ మండల కార్యాలయ క్యాంపస్లో వికలాంగుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించినట్లు తెలిపారు.




అయితే ప్రస్తుతం ఆ భవనాన్ని 108 సిబ్బంది వినియోగించుకుంటున్నారని, దీంతో వికలాంగుల సంఘాలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇతర హాళ్లను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను తిరిగి వారి అవసరాలకే కేటాయించాలని అధికారులను కోరారు.
ఇప్పటికైనా అధికారులు స్పందించి వికలాంగుల కమ్యూనిటీ హాల్ ను వారి అవసరాల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే వి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని నాయకులు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో వికలాంగుల సమైక్య నాయకులు తేజావత్ కొమురయ్య నాయక్, బి. రామచంద్రయ్య, గొల్ల పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో చార్జీల పెంపుపై నిరసన

**- రూ.10 నుంచి రూ.20కి పెంపు....**
**- రోడ్డెక్కిన మహిళా కూలీలు, కాలనీ వాసులు....**

**ధర్మవరం సెప్టెంబర్ 21 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం కేతిరెడ్డి కాలనీ నుంచి పట్టణంలోకి రాకపోకలు సాగించే ఆటో చార్జీలను ఒక్కసారిగా రెట్టింపు చేయడం పై మహిళా కూలీలు, కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రూ.10గా ఉన్న ఆటో చార్జీని సోమవారం నుంచి రూ.20కి పెంచడాన్ని నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. రోజువారీ కూలీ పనుల కోసం పట్టణానికి వచ్చి వెళ్లే తమ పై చార్జీల పెంపు అదనపు



ఆర్థిక భారం మోపుతుందని మహిళా కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ ధరల్లో ఎలాంటి పెరుగుదల లేకపోయినా ఆటో చార్జీలను రెట్టింపు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. కేతిరెడ్డి కాలనీ నుంచి పట్టణానికి రాకపోకలకు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆటోలపైనే ఆధారపడాల్సి వస్తోందని కాలనీ వాసులు తెలిపారు. పెంచిన ఆటో చార్జీలను వెంటనే తగ్గించాలి.. లేదంటే కేతిరెడ్డి కాలనీ ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ టౌన్ సర్వీస్ బస్సులను ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు. ప్రజల రవాణా సమస్యపై అధికారులు వెంటనే స్పందించి ఆటో చార్జీల నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తకూడదు




**- వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పంటలు సాగు చేయాలి**
**- జిల్లాలో 100% అక్షరాస్యత సాధించాలి**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురం, సెప్టెంబర్ 21: అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లాలో ఎక్కడ కూడా మంచి నీటి సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తాసిల్దార్ లు, ఎంపీడీవోలు ఏపీవోలతో మంచినీటి సమస్య, వ్యవసాయం, అక్షరాస్యత, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య తలెత్తకూడదన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు మంచినీటి సమస్య ఉందని ఎక్కడైనా ఫిర్యాదులు వచ్చినట్లయితే 24 గంటల లోపల సమస్యను పరిష్కరించాలన్నారు. నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు.ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి సమస్యను సీరియస్ గా తీసుకొని పనిచేయాలన్నారు.ఎల్ నినో సమస్యను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు రైతులు పంటలు సాగు చేసే విధంగా చూడాలని వ్యవసాయ శాఖ జెడిఎ కు సూచించారు. ఎల్ నినో సమస్యను ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ తదితర లైన్ డిపార్ట్మెంట్స్ సమన్వయంతో పనిచేయాలన్నారు.ప్రతి పౌరుడిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం “ఉల్లాస్ - అక్షరాంధ్ర” కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు వయోజన విద్య అధికారులు సిబ్బంది వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి 100% అక్షరాస్యత శాతాన్ని సాధించాలన్నారు. కొంతమంది వాలంటరీలు గౌరవ వేతనం లేకుండానే నిరీక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.
ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద వేతనదారులు, డిఆర్డిఎ పరిధిలోని మహిళలు, మెప్మా పరిధిలోని పొదుపు సంఘాల నిరక్షరాశులను గుర్తించి విద్యావంతులుగా మార్చాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, డిఆర్డిఏ పిడి శైలజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలు రెడ్డి, డ్వామా పిడి, ఏపీఎంఐపి పిడి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోషణ వల్లనే తల్లి బిడ్డల భవిత.. సిడిపిఓ లలితమ్మ

**- నాగుల గూడెం తాండా లో పోషణ్**
**- మాసం- 2026 అవగాహన కార్యక్రమం.**

**శింగనమల, సెప్టెంబర్ 21: అనంత జనశక్తి న్యూస్**

మంచి పోషక ఆహారం వల్లనే తల్లి బిడ్డల ఆరోగ్యకరమైన సాధ్యమని ఐసిడిఎస్ సిడిపిఓ సింగనమల ప్రాజెక్టు అధికారి లలితమ్మ తెలిపారు. సోమవారం సింగనమల మండల పరిధిలోని నాగులగుడ్డం తాండాలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సాయంత్రం జాతీయ పోషణ మాసోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పౌష్టిక ఆహారం ద్వారా కలిగే ప్రయోజనాలను గర్భిణీలకు, పిల్లల తల్లులకు, బాలింతలకు మరియు కిషోర్ బాలికలకు సిడిపిఓ అవగాహన కల్పించారు.ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమల్లో భాగంగా జిల్లా కలెక్టర్ వారి ఆదేశం మేరకు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా గర్భిణీలు బాలింతలు కిశోర బాలికలు పోషక ఆహార విలువల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతి సంవత్సరం జాతీయ పోషణ్



మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 రోజులపాటు పోషక ఆహారం ఆరోగ్యం బాలల అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా అవగాహన ర్యాలీలు, ఆహారంలో తీసుకోవాల్సిన వైవిధ్యం , ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగం తాజా వేడి వంటకాలు తదితర వాడకంపై ప్రాధాన్యత అంశాల గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ అవగాహన కార్యక్రమాల్లో సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడంతోపాటు అంగన్వాడి మానిటరింగ్ కమిటీల పాత్రను కూడా వివరించడం జరుగుతున్నట్లు తెలిపారు.
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ బాల్య అభివృద్ధి మరియు విద్య , ప్రధానమంత్రి మాతృ వందన యువజన, మిషన్ వాత్సల్య, ప్రీ స్కూల్, పోషక ఆహార పంపిణీ తదితర పథకాలు అర్హులందరికీ ఈ పథకం అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోషక ఆహార ప్రాముఖ్యతను ప్రతి కుటుంబానికి చేరే విధంగా సింగనమల నియోజకవర్గం పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా అన్ని అంగన్వాడీలలో ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం మన అంగన్వాడీ మన బాధ్యత అనే నినాదంతో పౌష్టిక ఆహారం ఆరోగ్యం బాలల వికాసం మరియు సమాజ భాగస్వామ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పౌష్టిక ఆహారంతో ఆరోగ్యక జీవితం బాలల సమగ్ర ఎదుగుదలకు మన సహకారం, ప్రతి బిడ్డకు ప్రేమతో పూర్తి సంరక్షణ ఆరోగ్యమైన బిడ్డ రేపటి బలమైన భారత్ మాతృ ఆరోగ్యం సురక్షితమైన బాల్యం అనే అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతున్నట్లు తెలిపారు.
కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో వైవిధ్యభరిత పోషక ఆహార ప్రదర్శన ఏర్పాటుచేసి తద్వారా తల్లులకు గర్భిణీలకు అవగాహన కల్పించడంతోపాటు బాలామృతం ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సమాచార శాఖ ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ కల్పనా అంగన్వాడి టీచర్లు జయలక్ష్మి లక్ష్మీదేవి రోగెమ్మ, నాయకులు సుదర్శన్ నాయక్ లక్ష్మణ్ నాయక్, ప్రధాన ఉపాధ్యాయురాలు మహేంద్ర మణి , హెల్త్ ఎడ్యుకేటర్ రామాంజనేయులు తాండ కాలనీవాసులు మరియు ఐసిడిఎస్ లబ్ధిదారులు పాల్గొనటం జరిగింది.



# పిల్లలు మిమ్మల్ని గౌరవించడం లేదా? పనిష్మెంట్ లేకుండా వారి ప్రవర్తనలో మార్పు తేవాలంటే ఏం చేయాలి?

పిల్లలు ఇంట్లో తిరిగితే ఆ కళే వేరు. వాళ్ల మాటలు కూడా మనకు సంతోషాన్నిస్తుంటాయి. కానీ, కొన్నిసార్లు వారి ప్రవర్తన మనల్ని నిరాశకు గురిచేస్తుంది. తల్లిదండ్రులుగా, మన పిల్లలు మన మాట వినాలని, మనల్ని గౌరవించాలని కోరుకోవడం సహజం. అయితే, కొన్నిసార్లు పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. ముఖ్యంగా, వారు మనల్ని గౌరవించనప్పుడు ఆ బాధ తీరనిది. ఎవరికీ చెప్పుకోలేనిది కూడా. మీ పిల్లలు మిమ్మల్ని గౌరవించడం లేదని మీరు భావిస్తున్నట్లయితే, ఇలా మీ ఒక్కరికే జరుగుతుందని దిగులు పడుతూ కూర్చోకండి. ప్రతి ఇంట్లో ఉండే సమస్యే ఇది. అనేక మంది తల్లిదండ్రులు ఈ సవాలును ఎదుర్కొంటారు. సరైన విధానాలు, చిట్కాలు పాటించి, మీ పట్ల మీ పిల్లలకు గౌరవాన్ని పెంపొందించవచ్చు. మీ బంధాన్ని మెరుగుపరచుకోవచ్చు. మీ పిల్లలు మిమ్మల్ని గౌరవించకపోతే ఏమి చేయాలో తెలుసుకోవడానికి కొన్ని ముఖ్యమైన చిట్కాలను ఇక్కడ అందిస్తున్నాము.



## పిల్లలు మిమ్మల్ని గౌరవించకపోతే ఏం చేయాలంటే..?

పిల్లలు మీకు తగిన గౌరవం ఇవ్వనప్పుడు అది చాలా బాధాకరంగా ఉంటుంది. ఇది అనేక కారణాల వల్ల వచ్చే సమస్య. ఈ కష్టమైన పరిస్థితిని అధిగమించడానికి, గౌరవప్రదమైన సంబంధాన్ని పెంపొందించడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయి. అవేంటంటే..

వయస్సు దశ: ఎదుగుతున్న పిల్లలలో, ముఖ్యంగా టీనేజ్ వయస్సులో స్వాతంత్ర్య భావాలు ఉండటం వల్ల కొన్నిసార్లు గౌరవం లేని ప్రవర్తన సాధారణం కావచ్చు.

నచ్చకపోవడం: మీ పిల్లవాడికి వినపడకపోవడం పోవడం వల్ల, ప్రేమపూర్వకంగా చెప్పకపోవడం వల్ల లేదా మీరు చెప్పే విషయాలు ముఖ్యమైనవి కావని భావించడం వల్ల అలా ప్రవర్తించవచ్చు. వారు ప్రతికూలమైనదైనా సరే, దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించవచ్చు.

భావోద్వేగాలను వ్యక్తీకరించడంలో ఇబ్బంది: పిల్లలకు తమ నిరాశ లేదా కోపాన్ని సరిగ్గా వ్యక్తీకరించడానికి పదాలు లేదా వీలు కుదరనప్పుడు వారు గౌరవం లేకుండా ప్రవర్తించవచ్చు.

నేర్చుకున్న ప్రవర్తన: పిల్లలు ఇంట్లో చూసే ప్రవర్తనను అనుకరిస్తారు. పెద్దలు ఒకరితో ఒకరు లేదా వారితో గౌరవం లేకుండా మాట్లాడుకోవడం చూస్తే,



వారు దానిని అనుకరించవచ్చు.

హద్దులు లేకపోవడం: స్థిరమైన లేదా స్పష్టమైన నియమాలు లేకపోవడం వల్ల పిల్లలు గౌరవం లేకుండా ప్రవర్తించవచ్చు.

అధికార పోరాటాలు: పిల్లలు పెద్దవుతున్న సమయంలో ఎక్కువ స్వయంప్రతిపత్తిని కోరుకుంటుంటారు. ఈ సమయంలో అధికారం లేదా పెత్తనం చెలాయించే విషయాలలో అధికార పోరాటాలు జరగొచ్చు.

బాహ్య ప్రభావాలు: తోటివారి ఒత్తిడి లేదా మీడియాలో గౌరవం లేని ప్రవర్తనకు గురికావడం ఒక పాత్ర పోషించవచ్చు.

అంతర్లీన సమస్యలు: కొన్నిసార్లు, గౌరవం లేకపోవడం మానసిక ఆరోగ్య సమస్యలు లేదా అభ్యసన ఇబ్బందులకు సంకేతం కావచ్చు.

మీ ప్రవర్తనలో తెచ్చుకోవాల్సిన మార్పులు

మీ చర్యలు చాలా ముఖ్యమైనవి. మీరు అంగీకరించకపోయినా, మీ పిల్లలను, ఇతరులను మర్యాదగా, దయతో, సానుభూతితో చూడండి. మీ భాగస్వామి పట్ల తల్లిదండ్రుల పట్ల గౌరవప్రదమైన సంబంధం ఉంటే, మొత్తం కుటుంబానికి బలమైన పునాదిగా ఉంటుంది. పిల్లలు మాట్లాడేటప్పుడు శ్రద్ధగా వినండి. కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడండి. వారితో ఏకీభవించకపోయినా వారి భావాలను గుర్తించండి.



## గౌరవంగా మాట్లాడండి:

కష్టమైన విషయాలను ప్రస్తావించేటప్పుడు లేదా హద్దులు నిర్ణయించేటప్పుడు కూడా ప్రశాంతంగా, మర్యాదగా మాట్లాడండి. అరవడం, తిట్టడం లేదా వ్యంగ్యంగా మాట్లాడటం మానుకోండి.

స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయండి:

కుటుంబానికి గౌరవప్రదమైన ప్రవర్తన ఎలా ఉంటుందో స్పష్టంగా వివరించండి. స్థిరమైన నియమాలను ఏర్పాటు చేయండి. సంభాషణ, ప్రవర్తనకు సంబంధించిన నియమాలను తెలియజేసి, వాటిని స్థిరంగా అమలు చేయండి. పర్యవసానాలను వివరించి పిల్లలు అర్థం చేసుకునేలా చేయండి. ఖాళీ బెదిరింపులు ఇవ్వకండి.

గౌరవం లేని ప్రవర్తనను శాంతంగా పరిష్కరించండి:

గౌరవం లేని ప్రవర్తన ప్రతిసారీ జరిగినప్పుడు దాన్ని పరిష్కరించండి. దానిని పట్టించుకోకపోతే అది సబబేననే భావన వారిలో కలుగుతుంది. గౌరవం లేని ప్రవర్తనను పరిష్కరించేటప్పుడు ప్రశాంతంగా ఉండటం చాలా ముఖ్యం. కోపంతో స్పందించడం పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు. వారి ప్రవర్తన మిమ్మల్ని ఎలా బాధపెడుతుందో వ్యక్తీకరించండి. వారి మాటలు, చర్యలు ఇతరులను ఎలా ప్రభావితం చేస్తాయో మీ పిల్లవాడికి అర్థమయ్యేలా తెలియజేయండి.

కాంప్లిమెంట్స్ ఇస్తూ ఉండండి:

మీ పిల్లలు గౌరవప్రదంగా ప్రవర్తించినప్పుడు వారిని గుర్తించి ప్రశంసించండి. ఇది వారిని అవే పనులు రిపీట్ చేయడానికి ప్రోత్సహిస్తుంది. గౌరవప్రదమైన ప్రవర్తనకు చిన్న బహుమతులు లేదా ప్రత్యేక అధికారాలను పరిగణించండి.

## సానుభూతిని పెంచుకోండి:

మీ బంధాన్ని బలోపేతం చేయడానికి పిల్లలతో ఒంటరిగా గడపండి. వారి ప్రవర్తన మీకు పూర్తిగా నచ్చకపోయినా వారి భావాలకు విలువ ఇవ్వండి. ప్రతి చిన్న తప్పుకు పెద్ద ఘర్షణ అవసరం లేదు. అత్యంత ముఖ్యమైన సమస్యలపై దృష్టి పెట్టండి.

గౌరవాన్ని డిమాండ్ చేయకండి:

గౌరవం పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలి. మీ పిల్లలను గౌరవంగా చూడటం ద్వారా, మీరు వారి గౌరవాన్ని తిరిగి పొందే అవకాశం ఉంటుంది. పరస్పర అవగాహన, పరిగణన ఆధారంగా సానుకూల, ఆరోగ్యకరమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడంపై దృష్టి పెట్టండి. చిల్డ్రన్ సైకాలజిస్ట్ ను సంప్రదించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించండి.

# జాగ్రత్త! ఈ పండ్లను కలిపి తిన్నారంటే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్న వారు అవుతారు!





ఆరోగ్యం కోసం పండ్లు ఎంతో ముఖ్యమైనవో మనందరికీ తెలుసు. వాటిలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరాన్ని అనేక రోగాల నుండి కాపాడతాయి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి ,రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అయితే, కొన్నిసార్లు మనం చేసే ఒక చిన్న పొరపాట్లు మన ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. అదేంటంటే కొన్ని రకాల పండ్లను కలిపి తినడం. ఆయుర్వేదం ,పోషకాహార నిపుణులు కొన్ని రకాల పండ్ల కలయికను ఆరోగ్యానికి మంచిది కాదని సూచిస్తున్నారు. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం

1) పుచ్చకాయ ,కర్బూజ - ఎప్పుడూ కలిపి తినకూడదు:

పుచ్చకాయ ,కర్బూజ జాతికి చెందిన పండ్లను వేర్వేరుగా తినడమే మంచిది. వీటిని ఇతర పండ్లతో కలిపితే జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పుచ్చకాయ చాలా తేలికగా ,త్వరగా జీర్ణమవుతుంది. ఇందులో నీటి శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇతర పండ్లతో కలిపినప్పుడు, పుచ్చకాయ త్వరగా జీర్ణమవ్వడానికి ప్రయత్నిస్తుంది, కానీ ఇతర పండ్లు ఆలస్యంగా జీర్ణమవుతాయి. దీని వల్ల కడుపులో అసౌకర్యం, గ్యాస్ వంటి ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తవచ్చు. కర్బూజ కూడా పుచ్చకాయ లాంటి లక్షణాలనే కలిగి ఉంటుంది కాబట్టి వీటిని కూడా విడిగా తీసుకోవడమే ఉత్తమం. మీరు ఒకేసారి పుచ్చకాయను తినండి లేదా కర్బూజను మాత్రమే తినడానికి ప్రయత్నించండి.

2) తీపి పండ్లు ,పుల్లటి పండ్లు - కలిపితే సమస్యలే:

ద్రాక్ష, స్ట్రాబెర్రీ, ఆపిల్, దానిమ్మ ,నారింజ వంటి పుల్లని లేదా సబ్-యాసిడ్ పండ్లను అరటిపండ్లు ,ఎండుద్రాక్ష వంటి తియ్యటి పండ్లతో ఎప్పుడూ కలపకూడదని ఆయుర్వేదం చెబుతోంది. ఇది చాలా చెడ్డ కాంబినేషన్ అని చెప్పవచ్చు. తీపి పండ్లు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి, అయితే ఆమ్ల పండ్లు త్వరగా జీర్ణమవుతాయి. ఈ రెండింటినీ కలిపి తిన్నప్పుడు, తీపి జీర్ణక్రియ అస్తవ్యస్తం అవుతుంది. కడుపులో పులియబెట్టడం (ఫెర్మెంటేషన్) జరుగుతుంది, ఇది గ్యాస్, ఉబ్బరం, ఎసిడిటీ ,తలనొప్పి వంటి సమస్యలకు దారితీయవచ్చు. కాబట్టి, తీపి పండ్లను విడిగా తినండి లేదంటే ఇతర తీపి పండ్లతో కలిపి తినండి. అలాగే, ఆమ్ల పండ్లను విడిగా లేదా ఇతర ఆమ్ల పండ్ల జాతికి చెందిన వాటితో కలిపి మాత్రమే తీసుకోండి.

3) బొప్పాయి ,నిమ్మకాయ - ప్రాణాంతక కలయిక:

బొప్పాయి ,నిమ్మకాయ కలయికను ఆరోగ్య నిపుణులు అత్యంత ప్రమాదకరమైన కలయికల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఈ రెండింటినీ కలిపి తినడం వల్ల రక్తహీనత (రక్తంలో ఐరన్ శాతం తగ్గడం) లేదా హిమోగ్లోబిన్ అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉంది. కొన్ని అధ్యయనాల ప్రకారం, ఈ కలయిక శరీరానికి విషపూరితంగా కూడా మారవచ్చు. కాబట్టి, మీ ఆరోగ్యం కోసం ఈ రెండు పండ్లను ఎప్పుడూ కలిపి తినకండి. వీటిని విడివిడిగా, అది కూడా కొంత సమయం వ్యవధిలో తీసుకోవడం మంచిది.

4) పండ్లు ,కూరగాయలు - జీర్ణక్రియకు విరుద్ధం:

చాలా మంది పండ్లను ,కూరగాయలను కలిపి తినడానికి ఇష్టపడతారు. ఇది జీర్ణక్రియకు అంత మంచిది కాదు. పండ్లు ,కూరగాయలు వేర్వేరు ఎంజైమ్‌ల సహాయంతో వేర్వేరు సమయాల్లో జీర్ణమవుతాయి. పండ్లలో సహజ చక్కెరలు (ఫ్రక్టోజ్) ఎక్కువగా ఉంటాయి, ఇవి కూరగాయల జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తాయి. ఉదాహరణకు, నారింజను క్యారెట్‌తో కలిపి తింటే కడుపు నొప్పి, గుండెల్లో మంట ,ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే, పండ్లను సలాడ్‌లలో లేదా కూరగాయల జ్యూస్‌లలో కలపడం కూడా మంచిది కాదు. వీలైనంత వరకు పండ్లను విడిగా, భోజనానికి ముందు లేదా భోజనం మధ్యలో తీసుకోవడానికి ప్రయత్నించండి. కూరగాయలను విడిగా లేదా ఇతర కూరగాయలతో కలిపి తీసుకోవచ్చు.

మరికొన్ని ముఖ్యమైన విషయాలు:

పండ్లను ఎప్పుడూ భోజనం చేసిన వెంటనే తినకూడదు. భోజనం తర్వాత కనీసం ఒక గంట లేదా రెండు గంటల గ్యాప్ ఉండాలి.

వివిధ రకాల పండ్లను ఒకేసారి ఎక్కువగా తినడం కూడా జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు.

పండిన ,తాజాగా ఉన్న పండ్లనే తినడానికి ప్రయత్నించండి.

మీ శరీర తత్వాన్ని బట్టి కొన్ని రకాల పండ్ల కలయికలు ఇబ్బంది కలిగించవచ్చు. కాబట్టి, మీ శరీరం ఎలా స్పందిస్తుందో గమనిస్తూ ఉండటం ముఖ్యం.

ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లను సరైన సమయంలో, సరైన విధంగా తీసుకోవడం చాలా ముఖ్యం. పైన తెలిపిన పండ్ల కలయికలను నివారించడం ద్వారా మీరు జీర్ణ సంబంధిత సమస్యలను నివారించవచ్చు ,పండ్ల యొక్క పూర్తి పోషక విలువలను పొందవచ్చు.





# జంట కుదిరేనా?

'ఇరుముడి'తో భారీ విజయాన్ని అందుకుని జోరుమీదున్నారు కథానాయకుడు రవితేజ. ఇప్పుడీ జోష్‌లోనే తదుపరి సినిమాని దర్శకుడు వివేక్ ఆత్రేయతో కలిసి పట్టాలెక్కించే పనిలో పడ్డారు. ఈ క్రేజీ కలయికలో రూపొందనున్న ఈ చిత్రాన్ని లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమాని దసరా సందర్భంగా సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే కథానాయిక ఎంపికపైనా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే ఇప్పుడా పాత్ర కోసం ప్రియాంక అరుళ్ మోహన్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఆమె ఇప్పటికే వివేక్ దర్శకత్వంలో 'సరిపోదా శనివారం'లో నటించిన సంగతి తెలిసిందే. అది బాక్సాఫీస్ బరిలో మంచి విజయాన్ని అందుకుంది. మరి ఇప్పుడీ కాంబో రెండోసారి పునరావృతం కానుందా? లేదా? అన్నది త్వరలోనే స్పష్టత రానుంది. ఈ సినిమా కోసం రవితేజ తొలిసారి మునుపెన్నడూ స్పృశించని కథలో భాగమవుతున్నారని.. ఇది హారర్, కామెడీ అంశాల మేళవింపుగా ఉంటుందని ప్రచారం వినిపిస్తోంది.

## హీరోయిన్‌ల ప్రమోషన్ ఖర్చు..

# తొలిరోజు వసూళ్ల కంటే ఎక్కువ



ఇండస్ట్రీలో నటీనటుల సినిమా ప్రచార ఖర్చులపై నటి అమీషా పటేల్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అమీషా తాజాగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఈ విషయాన్ని ప్రస్తావించారు. "చాలా మంది హీరోయిన్లు వారి స్థాయిని అంగీకరించలేరు. స్టార్‌డమ్‌పై భ్రమల్లో బతుకుతున్నారు. ప్రమోషన్ల సమయంలో నిర్మాతల ఖర్చుతో వారు చేసే హంగామా... ఆ సినిమా మొదటి రోజు బాక్సాఫీస్ కలెక్షన్ల కంటే ఎక్కువగా ఉంటుంది. వాళ్లు నిజజీవితంలోనూ అలానే విలాసవంతమైన జీవితాన్ని గడపాలని ఆశిస్తున్నా" అని అమీషా వ్యంగ్యంగా అన్నారు. అయితే ఆమె నేరుగా ఎవరి పేరును ప్రస్తావించలేదు. ఇక సినిమాల ఎంపిక గురించి మాట్లాడుతూ.. రొటీన్‌గా ఉండే సినిమాలు చేసుకుంటూ వెళ్లే బదులు.. ఒక్కసారైనా 'గదర్' లాంటి సినిమా చేసినా చాలన్నారు. బాక్సాఫీస్ వద్ద మళ్లీ అలాంటి మంచి సినిమాలు త్వరలోనే ప్రభంజనం సృష్టిస్తాయని తెలిపారు.



# రాయల్స్ సెట్‌లో నోరా సందడి

తనదైన నటన, అదిరిపోయే ప్రత్యేక పాటలతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తుంటుంది అందాల తార నోరా ఫతేహి. ఆమె ఓ కీలక పాత్రలో నటిస్తున్న సిరీస్ 'ది రాయల్స్ సీజన్ 2'. బాలీవుడ్ హీరో ఇషాన్ ఖట్టర్ కథానాయకుడిగా నటిస్తున్నారు. గతేడాది విడుదలై ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న 'ది రాయల్స్'కి సీక్వెల్‌గా దీన్ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ సిరీస్ చిత్రీకరణ కోసం సెట్లోకి అడుగుపెట్టింది నోరా. ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇటీవలే సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టిందామె. రాజకుటుంబం, వారి మధ్య ఉండే సంబంధాల నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ రెండో సీజన్‌కు 'డార్లింగ్స్' ఫేమ్ జస్మీత్ కె.రీన్ దర్శకత్వం వహిస్తున్నట్లు బాలీవుడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# సమాజంలో విడాకులు పెరగడానికి కారణమిదే: కాజల్ అగర్వాల్

మారుతున్న అనుబంధాలు, పెరుగుతోన్న విడాకుల కేసులపై సినీ నటి కాజల్ అగర్వాల్ స్పందించారు. మనుషుల మధ్య అనుబంధాలపై సోషల్ మీడియా ప్రభావం చూపుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఫోన్‌ల కారణంగా దంపతుల మధ్య ప్రత్యక్ష సంభాషణలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెస్టరంట్లు, డిన్నర్ డేట్‌లకు వెళ్లినప్పుడు కూడా చాలా మంది.. ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా ఫోన్లకే పరిమితమవుతున్నారన్నారు. అర్థవంతమైన మాటలు, ఒకరికొకరు సమయం కేటాయించుకోవడం తగ్గిపోవడం వల్లే బంధాల్లో దూరాలు పెరుగుతున్నాయని అన్నారు. "నేను, నా భర్త ఖాళీ సమయాన్ని చాలా గౌరవిస్తాం. ప్రతివారం క్రమం తప్పకుండా డిన్నర్‌కు వెళ్తాం. ఫోన్లను పక్కనపెట్టి ప్రశాంతంగా మాట్లాడుకుంటాం" అని కాజల్ చెప్పారు. సోషల్ మీడియా వ్యామోహం నుంచి బయటపడి భాగస్వామితో.. సమయాన్ని గడపడం అలవాటు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. కాజల్ అగర్వాల్ ఇటీవల 'ది ఇండియా స్టోరీ'తో పలకరించారు. ప్రస్తుతం ఈ సినిమా జియోహాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



# ఫైనల్‌కు వెళ్లకుండా సుచికను అడ్డుకున్న '700 గ్రాములు'.. రూల్స్ ఏం చెబుతున్నాయంటే?



తొలిసారి ఆసియా క్రీడల్లో ప్రవేశపెట్టిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో భారత అథ్లెట్ సుచిక తరియల్ కాంస్యం దక్కించుకుంది. అయితే, సెమీస్‌లో అద్భుతంగా పోరాడినప్పటికీ ఓటమి తప్పలేదు. ఇక్కడ 'బరువు' రూల్ వల్లే ఆమె ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. మహిళల-60 కేజీల విభాగంలో సింగపూర్‌కు చెందిన హుయ్ హువాన్ టియోతో సుచిక తలపడింది.

అదే వ్యత్యాసం..

విజయం కోసం సుచిక - టియో చివరి వరకూ తమ నైపుణ్యాలతో పోరాడారు. నిర్దిష్ట సమయం వరకూ ఇద్దరి స్కోర్లు సమంగా నిలిచినా.. టియో ఆధిపత్యం ప్రదర్శించిందని ముగ్గురు రిఫరీలు భావించారు. దీంతో ఆమెను విజేతగా ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. ఈ ఫలితంపై భారత బృందం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో 10 మంది అధికారులు రివ్యూ చేసి మ్యాచ్ డ్రా అయినట్లు ప్రకటించారు. ఇది కూడా సుచికకు కలిసిరాలేదు. మ్యాచ్ టై కావడంతో.. ఆసియా ఎంఎంఏ నిబంధనల ప్రకారం 'బరువు'ను ప్రామాణికంగా తీసుకొని సింగపూర్ అథ్లెట్ టియోను విజేతగా నిర్ణయించారు. పోటీలకు ముందు ఉదయం ప్రతి అథ్లెట్ బరువును చెక్ చేస్తారు. సుచిక కంటే టియో 700 గ్రాములు తక్కువగా ఉంది. దీంతో ఆమె ఫైనల్‌కు చేరుకోగా.. భారత క్రీడాకారిణి సెమీస్‌లో ఓటమితో కాంస్యంతోనే సరిపెట్టుకొంది. ఫైనల్‌కు చేరి ఉంటే కనీసం రజతం దక్కించుకునే అవకాశం ఉండేది.

రూల్స్ ఏం చెబుతున్నాయంటే?

అదనపు సమయంలోనూ మ్యాచ్ ఫలితం తేలకుండా డ్రా లేదా టై అయితే విన్నర్‌ను నిర్ణయించేందుకు కొన్ని ప్రమాణాలను పాటిస్తారు.

తొలుత అథ్లెట్లు ఏమైనా వార్నింగ్‌లను అందుకున్నారా? అని చెక్ చేస్తారు. వార్నింగ్ ఒకరికి వచ్చి.. మరొకరికి రాకపోతే వారినే విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ వార్నింగ్‌లు కూడా సమంగా ఉంటే అడ్వైస్‌లను లెక్కిస్తారు. అవన్నీ సమంగా ఉండటం లేదా ఎవరికీ రాకపోతే కీలకమైన 'బరువు'ను చూస్తారు. పోటీరోజు ఉదయం ఎంత బరువు ఉన్నారనేది నమోదు చేస్తారు. తక్కువ బరువు ఉన్న అథ్లెట్ విజేత అవుతారు. ఒకవేళ ఉదయం బరువు కూడా సమంగా ఉంటే.. అప్పుడు మ్యాచ్ ముగిసిన తర్వాత ఉన్న బరువుతో పోలుస్తారు. అది కూడా ఒకేలా ఉంటే.. ముగ్గురు సైడ్ రిఫరీలు ఫ్లాగ్ నిర్ణయం ద్వారా విజేతను తేలుస్తారు. ఆయా రిఫరీల విచక్షణపై ఇది ఆధారపడి ఉంటుంది. సుచిక విషయంలో మాత్రం ఉదయం బరువు కాస్త ఎక్కువగా ఉండటంతో ఆమె ఫైనల్‌కు చేరుకోలేకపోయింది.

# 12 ఏళ్ల వయసులో వేధింపులు.. 24 ఏళ్ల తర్వాత చరిత్ర పుటల్లోకి: ఎవరీ సుచిక తరియల్

ఆసియా గేమ్స్‌లో తొలిసారి ప్రవేశపెట్టిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (MMA)లో భారత్‌కు పతకం వచ్చింది. మహిళల విభాగంలో సుచిక తరియల్ కాంస్య పతకం సొంతం చేసుకుంది. 12 ఏళ్ల వయసులో వేధింపులకు గురైన ఆ అమ్మాయి.. ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంది. ఇప్పుడు 24 సంవత్సరాల తర్వాత 36 ఏళ్ల వయసులో మెడల్ సాధించి చరిత్ర సృష్టించింది.




భారత్ తరపున అంతర్జాతీయ పోటీల్లో సుచిక తరియల్ ప్రాతినిధ్యం వహించింది. ఆసియా క్రీడల్లో ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన తొలి భారత అథ్లెట్‌గా ఘనతను ఖాతాలో వేసుకుంది. ప్రతి అథ్లెట్ జీవితం వెనుక కష్టనష్టాలు ఉంటాయి. సుచిక లైఫ్ కూడా అందుకు భిన్నమేం కాదు. ఇంకా చెప్పాలంటే.. ఆమె జూడో వైపు రావడానికి బలమైన కారణమే ఉంది. 12 ఏళ్ల వయసులో ఆమె ఓసారి సెలూన్‌కు వెళ్లినప్పుడు ఈవ్ టీజింగ్ బారిన పడింది. ఆ ఘటన ఆమె మనసులో నాటుకుపోయింది. తనను తాను కాపాడుకోవాలంటే ఫైటింగ్ స్కిల్స్ అవసరమని బలంగా అనుకుంది. అలా జూడోలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత ఆటే తన కెరీర్‌గా మారిపోయింది. ఓ దశలో క్రీడలకు వీడ్కోలు చెబుదామనే పరిస్థితులూ తలెత్తాయి. వాటన్నింటిని జయించి మరీ ఈ స్టేజ్‌పైకి వచ్చింది. ప్రస్తుతం ఆమె సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది.

కుటుంబం భయపడినా..

సుచిక క్రీడా ప్రయాణం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మొదలైంది. ఆ తర్వాత పాలంలోని దాదా దేవ్ మందిర్ సెంటర్‌లో శిక్షణకు వెళ్లింది. అక్కడ్నుంచి భోపాల్‌లోని భారత క్రీడల అథారిటీకేంద్రానికి చేరుకుంది. అయితే, క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలని భావించినప్పుడు.. ఆమె కుటుంబ సభ్యులు భయపడ్డారు. ప్రయాణాలు చేయాల్సి ఉండటంతో ఆందోళన చెందారు. ఆ అడ్డంకులు ఆమెను ఆపలేకపోయాయి. అతి తక్కువ వ్యవధిలోనే అంతర్జాతీయ జుడొకా అథ్లెట్‌గా పేరొందింది. సుమారుగా 20 ఇంటర్నేషనల్ ఈవెంట్లలో పోటీ పడింది. జాతీయ జూడో ఛాంపియన్‌షిప్‌నూ ఎనిమిదిసార్లు కైవసం చేసుకుంది.

అక్కడ్నుంచి.. 2022 వరకు జూడోలో పోటీ పడిన సుచిక.. ఆ తర్వాత జియూ - జిట్సు క్రీడకు మారింది. 2024లో జరిగిన జేజేఐఎఫ్ జు-జిట్సూ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో 63 కేజీల కేటగిరీలో తలపడింది. అందులో బంగారు పతకం సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆమె మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌కు మారిపోయింది. 2017లోనే అరంగేట్రం చేసి విజయాలు కూడా సాధించింది. కానీ, ఏడేళ్లపాటు ఎంఎంఏకు దూరంగా ఉన్న సుచిక.. రెండేళ్ల కిందట మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌పై మళ్లీ దృష్టిసారించింది. గాయాలు ఇబ్బంది పెట్టడంతో ఒక దశలో ఆటకు గుడ్‌బై చెబుదామని భావించింది.

వాటిని దాటుకొని..

ఆసియా గేమ్స్ కోసం అర్హత విధానం కూడా సుచికను ఇబ్బంది పెట్టింది. అర్హత ప్రమాణాల ప్రక్రియలో శాప్ సడెన్‌గా మార్పులు చేసింది. ఆసియా ర్యాంకుల్లో తొలి ఆరు స్థానాల్లో ఉంటేనే క్రీడలకు ఎంపిక చేస్తారు. ఆసియా ఛాంపియన్‌షిప్‌ల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ నిధులు అందుబాటులో లేకపోవడంతో సొంత ఖర్చుతో పోటీలకు వెళ్లింది. అక్కడ రెండు కాంస్య పతకాలు సాధించడంతో ఆసియా క్రీడల ఎంపికకు మార్గం సుగమమైంది. ఎంఎంఏ -ఎస్ఎఫ్ఐ నుంచి మద్దతు దక్కించుకుంది. ఆసియా గేమ్స్ బరిలోకి దిగి పతకం సొంతం చేసుకుంది.

# రోహిత్ శర్మకు 'అగార్కర్' లైన్ క్లియర్.. మరి ఫిట్‌నెస్?: వేచి చూసే ధోరణిలో బీసీసీఐ

వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై ఎన్నో అంచనాలు, విశ్లేషణలు వినిపిస్తూనే ఉన్నాయి. అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి రోహిత్ ను ఆడించే ఉద్దేశం లేదని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ దిగిపోవడం ఖాయమేనని తెలుస్తోంది. దీంతో రోహిత్‌ను వన్డేల్లో కొనసాగించడానికి లైన్ క్లియరైనట్లేనని అంతా భావిస్తున్నారు. అయితే, బీసీసీఐ మాత్రం ఈ విషయంలో ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. రోహిత్ ఫిట్‌నెస్ పై ఇంకా సందేహాలు ఉండటమే ఇందుకు కారణంగా కన్పిస్తోంది.

వచ్చే ప్రపంచకప్ టోర్నీకి రోహిత్ స్థానంలో యశస్వి జైస్వాల్‌ను తీసుకోవాలని అగార్కర్ కమిటీ భావించింది. అయితే, బీసీసీఐ ఇందుకు విముఖత వ్యక్తం చేసింది. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసింది. మరోవైపు, రిటైర్మెంట్ ప్రచారం వేళ.. లార్డ్స్‌లో 138 పరుగుల ప్రదర్శన చేసి రోహిత్ సెలక్టర్లకు సవాల్ విసిరాడు. దీంతో అతడిని వరల్డ్ కప్ వరకు కొనసాగించేందుకే బోర్డు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. కాకపోతే రోహిత్ ఫిట్‌నెస్ విషయంలోనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.39 ఏళ్ల హిట్‌మ్యాన్ గత ఐపీఎల్ సీజన్‌లో గాయం కారణంగా వరుసగా నాలుగు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఇక, బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌లు, ఒత్తిడి లేని మ్యాచుల్లోనే అతడు అదరగొడుతున్నాడనే అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా సిరీస్ కోల్పోయిన తర్వాతే.. ఆ రెండు జట్లపై రోహిత్ సెంచరీలు చేయడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో వరల్డ్ కప్ టోర్నీకి తాను అందుబాటులో, ఫిట్‌గా ఉండగలనని నిరూపించుకోవాల్సిన బాధ్యత రోహిత్‌పైనే ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ, ప్రపంచకప్ ముందు రోహిత్ ఫిట్‌నెస్ దెబ్బతింటే.. అప్పటికప్పుడు జైస్వాల్‌ను సిద్ధం చేయడం కష్టమవుతుందనే వాదనలూ ఉన్నాయి. అందుకే, ఇప్పటి నుంచే జైస్వాల్‌ను వన్డేల్లో ఆడించాలని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU, ASSOCIATE EDITOR MARUTHI BIKSHA REDDY Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945